UNIVERSAL LIBRARY
OU_204084
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T928.
V44T

Accession No. T1667

Author వేంకట సూర్యప్రకాశరావు.

Title తెనాలి రామకృష్ణుడు 1954 (Telugu)

This book should be returned on or before the date last marked below.

[illegible] ర్త:

[illegible] కుమార వేంకట సూర్యప్రకాశరావు

పబ్లిషర్సు:

కొండపల్లి వీరవెంకయ్యా అండ్

శ్రీ సత్యనారాయణ బుక్ డిపో

రాజమండ్రి

1954

కాపీ రిజిష్టర్డు]

[వెల 1—0—

విషయసూచిక

1 జనన్రము

2 బాల్యము

3 ఆస్థానమునఁ బ్రవేశించుట

4 ధూర్జటికవి

5 దొంగలచే నీరు తోడించుట

6 మూరుతప్పులకు ఫర్మానా

7 తాతాచార్యుల నవమానించుట

8 సమస్యా పూరణము

9 భారత రచన

10 కుంకుమభొట్లు

11 ప్రెగడరాజు నరసరాజు

12 కవితాప్రసక్తి

13 అమవసనిశికిన్

14 ఆనందభట్టు

15 పెద్దనకవిత్వము నాక్షేపించుట

17 కవిగండ పెండేరము

18 రామకృష్ణుడు - [illegible]

19 విష్ణుచిత్తీయ విమర్శన

20 శివి

21 నల్లకుక్క నావుగ జేయుట

22 పింగళి సూరన్న

23 పురాణశ్రవణము

24 భాగవతము

25 తిమ్మరుసు

26 శిలశాస్త్ర మహిమ బంధనము

27 కుమ్మర మొల్ల

28 అయిదు వేలు

29 మామిడిపండ్లు

30 చిన్నాదేవి

31 పట్టెడు మెతుకు

32 తాతాచార్యుల కవమానము

ఓం

అవిఘ్నమస్తు

శ్రీరామాయ నమః

తెనాలి రామకృష్ణకవి చరిత్రము

జననము

తెనాలి రామకృష్ణకవి పేరు వినిన యాంధ్రుఁడుండఁడు. ఈకవి కృష్ణామండలములోని తెనాలి యను యగ్రహారమున జన్మించెను. ఈతనితల్లి లక్ష్మమాంబ తండ్రి రామయామాత్యుడు. యాజ్ఞవల్క్య బ్రాహ్మణుడు. కౌండిన్యసగోత్రుడు. రామకృష్ణకవి తన్నుఁ గూర్చి పాండురంగ మహాత్మ్యమునం దిట్లు వ్రాసికొనియున్నాఁడు.

క. నను రామకృష్ణకవిఁ గవి
జనసహకారావళీవసంతోత్సవ సూ
క్తినిధిఁ బిలిపించి యర్ధా
సనమునఁ గూర్చుండబనిచి చతురత ననియెన్.

సీ. నలుదెఱంగుల కావ్యనవసుధాధారల
ఘనుఁడా వాశువునందుఁ గరము మేటి
నఖిల భూమీపాల కాస్థానకమలాక
రోదయతరుణ సూర్యోదయుఁడవు
శైవవైష్ణవ పురాణావళీ నానార్థ
రచనాపటిష్ఠైక రమ్యమతివి
లౌకికవైదికలక్షణ చాతుర్య
ధైర్యప్రభారూఢ కార్యచరణుఁడ

గీ. నాంధ్రభూమీ కుచాగ్రహారాభమైన
శ్రీ తెనాల్యగ్రహార నిర్ణేతవగ్ర
శాఖికాకోకిలమవీవు సరసకవివి
రమ్యగుణకృష్ణ రామయ రామకష్ణ

క. కౌండిన్యసగోత్రుఁడవా
ఖండలగురువిభుఁడ నఖిల కావ్యరససుధా
మండనకుండలుఁడవు భూ
మండల వినుతుఁడవు లక్ష్మమాంబరతనయా.

క. యశము కలిగించు నీమృదు
విశదోక్తులఁ బౌండరీకవిభుచరితుఁ జతు
ర్దశభువన వినుతముఁగ శుభ
వశగతి నాపేర నుడువు వరతత్త్వనిధీ.

ఉ. స్కాంధపురాణ వీరనిధికౌస్తుభమై ప్రభవించు దేవకీ
నందను సత్కథోద్యమము నన్యకవిత్వకళాకలాపమున్
కుందనమున్ ఘటించు, కడుఁగొత్తగు సొమ్మొనరించి విష్ణుసే
వందిలకించు నప్పరమవైష్ణవకోటి నలంకరింపుమా.

మ. ఉభయంబస్తనగంబు సేతువు హిమవ్యూహంబునుం జుట్టిరా
విదితంబైన మహాన్మహాంధ్రకవితా విద్యాబలప్రౌఢి నీ
కెదురేరీ సరసార్థబోధఘటనా హేలాపరిష్కార శా
రదనీరూపము రామకృష్ణకవిచంద్రా! సాంద్రకీర్తీశ్వరా!

తెనాలిరామకృష్ణకవి క్రీ.శ. 1505 సం॥రమునకుఁ బూర్వము వాఁడని చరిత్ర వాకొనుచున్నది. శ్రీకృష్ణదేవరాయల యాస్థానమునఁ బేరుగన్న యష్టదిగ్గజములలో నీతఁ డొకడని చెప్పుదురు. అల్లసాని పెద్దన, నందితిమ్మన, అయ్యలరాజు రామభద్రుఁడు, ధూర్జటి

కాకమాను రామరాజ భూషణుడు, ప్రౌఢకవి మల్లన్న, పింగళి సూరన్న తెనాలి రామకృష్ణకవి—వీ రష్టదిగ్గజములని కీర్తిగాంచిరి.

---

2 బాల్యము

రామకృష్ణకవి బాల్యావస్థలో నున్నపు డపరిమితముగ నల్లరి సేయుచు తలిదండ్రులమాట పాటింపక తిరుగుచుండెను. ఈతఁడొక నాఁడు కొందరు బాలురతో కలిసి యాటలాడుచుండగా, నామార్గమున బోవుచుండిన సిద్ధుఁడొకఁడాగి, రామకృష్ణుని ముఖమువంక తదేకదృష్టిగఁజూచి, రమ్మని పిలచి యిట్లనెను—ఓ బాలుఁడా! నాతో దూరము వత్తువేని నీకు మేలు కలిగించెదను.

రామకృష్ణుఁడా సిద్ధునియెడల గౌరవయుక్తుఁడై యనుసరించెను. కొంతదూరము గొనిపోయి యాసన్యాసి, ఓ బాలుడా నీ ముఖమున నసాధారణమగు తేజముప్రస్ఫుటమగుచున్నది. నీకు గాళికామంత్రము నుపదేశింతును. భక్తిముక్తుఁడవై, దేవి యాలయమునకు బోయి గర్భగుడిలో గూర్చుండి, జపింపుము. నీకు మేలు కలుగును. అనియొకమంత్రము నుపదేశించి వెళ్ళెను.

రామకృష్ణుడు నిర్భయచిత్తుఁడై కాళికాలయమునకు బోయి యేకాగ్రచిత్తముతో నామంత్రమునుజపింపగా, దేవి సంతుష్టినొంది సాక్షాత్కరించెను. దయార్ద్రహృదయయై దేవిప్రత్యక్షమైనంతనే రామకృష్ణకవి భక్తియుక్తుఁడై ధ్యానించుటకుమాఱు ఫక్కుననవ్వెను. కాళికాదేవి యాగ్రహమునొంది 'ఏమిరా'నన్ను చూచి నవ్వెదవు అని గర్జించెను. భయభక్తులు తన్ను ముప్పిరిగొనగ నాతడు 'అమ్మా! నన్ను క్షమింపుము నేను నీదాసుఁడను, నీరూపము చూడగానే నా చిత్తము సందేహాయత్తమైనది' అనెను.

'అ సంశయమేమి?' అని దేవి ప్రశ్నింప, రామకృష్ణుడు తల్లీ! మాకు పడిశము బట్టినచో రెండుచేతులతోను బాధపడుచున్నను జాలుబలేదే సహస్రశీర్షములుగల నీకు పడిశము పట్టినచో నెట్లు బాధపడుదెవోయని నవ్వువచ్చినది. అని బదులు చెప్పెను. అతని పరి హాసమునకు బ్రమాదంబంది దేవి 'రామకృష్ణా! నీవు వికటకవివై ధనయశస్సముపార్జన మొనరింతువు' అని యంతర్ధానమయ్యెను.

కాళికాదేవి యొకగిన్నెలో క్షీరమును, మరియొకగిన్నెలో పెరుగును బోసి, 'దీనిలోనీకేది కావలయు?'నని ప్రశ్నింపగా నాతడు అమ్మా! ఆపాత్రలను నీచేతిలోయుంచుకొనియడిగినచో నేనేమిచెప్ప దును? అని వానినందుకొని 'ఇదియేమి?' అని ప్రశ్నింపగా, దేవి ఇది విద్య, ఇది ధనము, ఈరెండింటిలో నీకేమి కావలయునో తీసుకొను' మనెను. రామకృష్ణుడు 'అమ్మా! విద్యయుండి ధనములేని మనుజులకు మర్యాదయుండదు. దారిద్ర్యానలమునమ్రగ్గిపోవుచు నెవడును గ్రంథ ములరచించి విద్యావ్యాప్తికి తోడ్పడజాలడు. కావున విద్యాధన ములురెండును మానవున కవసరమే'యని పాలును పెరుగును కూడద్రాగివైచెను.

అతని సాహసమున కచ్చెరువంది దేవి 'రామకృష్ణా! నీకవి త్వము శాశ్వతమై ఆచంద్రతారార్కమై వెలయుగాక'యని దీవించి మాయమయ్యెనని కొందరు చెప్పుదురు.

---

3 ఆస్థానమున బ్రవేశించుట

విద్యానగరమున కేలికయైన సాళువనరసరాయలు దేశసంచార మొనరించుచు తెనాలినొకసారి చూడబోయి యచ్చట పాఠశాలకరి

గెను. ఆ బాలురందఱిని కూర్చుండ నియమించి, నరసరాయలు 'బాలురారా! మీలో తెలివిగల వారెవరో లేచి నిలువఁబడుఁడు' అనెను. అందఱును ఒకరిమొగము లొకరు చూచుకొనుచు నూరకుండిరి. రామకృష్ణుఁడు లేచి నిలువబడెను. నరసరాయ లిట్లు ప్రశ్నించెను— 'అబ్బాయీ! అందఱును మారుమాటాడక కూర్చుండియుండగా నీవేల లేచి నిలువఁబడితివి?'

రామకృష్ణుడు ధైర్యముగా 'అయ్యా! ఎవరు తెలివిగలవారో లేచి నిలువబడుడు అనికదా ప్రశ్నించిరి. అందఱును దెలివిహీనుల వలె కూర్చుండిరి. ప్రతివారికిని గొంచెమోగొప్పగనో తెలివి యుండి తీరునుగాని యుండకపోదు. ఈ బాలులందరును దమ తెలివి గుర్తింప నేరని మూఢులుగాన మాటాడక యూరకున్నారు. నేను తెలివిగల వాడనను ధైర్యము నాకు గలదు గాన నిలువబడితిని' అని పలికెను.

నరసరాయలు విస్మయపరిచేతస్కుఁడై, యాతడు వృద్ధిలోనికి రాగలడని తలంచి ఓయీ! నీకేదైన జిన్నయుద్యోగ మిప్పింతును. నాతో వత్తువా?' యని ప్రశ్నింప నాత డంగీకరించి తలిదండ్రులతో కలిసి యాతని ననుసరించి చనెను. తెనాలికి సమీపముననున్న బట్టుపల్లె యనుగ్రామములోని బట్రాజుల సాంగత్యముచేసి రామకృష్ణుడు కవితచెప్పుటయందు ప్రావీణ్యము సంపాదించెను. రామకృష్ణు డల్లసాని పెద్దనయను కవీంద్రుని దర్శించి, యాతడు సంతసించున ట్లీక్రింది పద్యము రచించి చదివెను—

క. నలుగురు నినుఁ బలుమారున్
గెలుతురు సుగుణోక్తికి కాంతికీర్త్యాకృతులన్
నలుగురు నినుఁ బలుమారున్
ఛళిఛళియన కచ్ఛరంగ పాండురరంగా!

నాఁటగోలె పెద్దనకవీశ్వరుఁడు రామకృష్ణునివిషయమై రాయలతోఁ జెప్పి యాస్థానకవిగా బరిగణింప వలసినదని కోరెనని చెప్పుదురు. కొండఱు నందితిమ్మనకవీంద్రు నుద్దేశించి రామకృష్ణుఁడు.

క. 'నీకవితామాధుర్యం
బేకవులకు గలుగ నేర్చునే కూపనట
ద్భేకములకు నాకధుని
శీకరములచెమ్మ ! నందిసింగయతిమ్మా'

యని చదివెనట. అంత నా నందితిమ్మన్న కవీంద్రుఁడు పరమానందభరితాత్ముండై తనకు శ్రీకృష్ణదేవరాయలు బహుమానముగ నొసంగిన శాలువ నిచ్చెను. ఆశాలువ ధరించి, రామకృష్ణుఁడాస్థానమునకుఁ బోయెను. రాయలు రామకృష్ణుఁడు ధరించియున్న శాలువా చూచి 'కవిచంద్రమా! నీ కియ్యది యెట్లు లభించినది?' అని ప్రశ్నింపగా తనపద్యమునకు సంతోషించి, నందితిమ్మన్న యాపచ్చడము నొసంగెనని చెప్పి యాపద్యము జదివెను. రాయలు సంతసించి రామకృష్ణుని సన్మానించెనట.

---

4 ధూర్జటి కవి

ఆస్థానకవులందఱిలో కృష్ణదేవరాయలకు ధూర్జటికవిపై నత్యధికమగు ప్రీతిఁగలిగియుండెను. కవితాగోష్ఠి సలుపునపుడు రాయలు తఱచుగా ధూర్జటి కవిత్వమును గూర్చియే ప్రశంసించు చుండెను. ధూర్జటి పైకి పరమశ్రోత్రియుడుగా గన్పట్టుచు రహస్యముగా వారాంగనాలోలుఁడై మెలగుచుండెను. అట్టి మహాకవి యనినీతివర్తనుడై మెలగుచు భార్యమోము చూడకుండుటచే నెట్లయిన యాతని వేశ్యానురక్తి తొలగజేయవలయునని పెద్దనాదులందరు నిశ్చయించుకొని, రామకృష్ణకవితో 'ఇది నీవల్ల జరుగవలసిన పనిగాని మావలన

జరుగదు అని చెప్పిరి. సరేయని రామకృష్ణుడు తగిన యదనుకై నిరీక్షించుచుండెను.

రాయలొకనాఁడు కొలువుకూటమున నున్న కవుల నందరను దిలకించి యిట్లు సమస్యనిచ్చి పూరించుమనెను.

'చ. స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల కేల కల్గెనో
యతులిత మాధురీమహిమ......'

రామకృష్ణకవి లేచి యిట్లు పద్యములోని మిగిలిన భాగము పూర్తిచేసెను.

......హా తెలిసెఁ! భువనైక మోహనో
ద్ధతసుకుమారవార వనితాజనతా ఘనతాపహారిసం
తతమధురాధరోదితసుధారసధారలఁ గ్రోలగాఁజుమీ!

వారాంగనపాన మొనరించుటచేతచే ధూర్జటి కవిత్వ మంత రసవంతమై యున్నదను భావము నలుగురకు బోధపడుటనే ధూర్జటి సిగ్గుపడి వికటకవి నేమియు ననఁజాలక యూరకుండెను. రాయలు ధూర్జటిని కొన్నిరోజులైనపిదప నంతఃపురమునకుఁ బిలిపించి, వేశ్య సహవాసము మానుమని మందలించెను.

---

5 దొంగలచే నీరు తోడించుట

శ్రీకృష్ణదేవరాయ లొకప్పుడు ఖైదీలను బరీక్షించుటకై కారాగృహమున కేగెను. అపరాధులందరును దమతమ యపరాధములను రాయల కెరింగించుచుఁ దమకు నిర్బంధవిమోచనముఁ గలిగింపుమని ప్రార్థించుచుండిరి. ఇరువురు దొంగలు రాయలు తమ్ము 'మీరు చేసిన యపరాధములఁ దెలుపు' డనినంతనే యిట్లు చెప్పిరి. మహారాజా! మాకు చౌర్యమున నద్భుతము ననుపమానము నగు నేర్పు కలదు. మేము గజదొంగలము. ఈవృత్తిని మానుటకు

మమ్ము క్షమించి విడిచిపుచ్చుడు. తమరు మాకు చౌర్యమున గల గౌశలమును బరీక్షింపవచ్చును.

రాయలు 'సరే' మీరు నేటిరాత్రి రామకృష్ణకవి యింట నెవరికిని బ్రమాదము గలుగకుండ నేదైన యపహరించి గొనితెండు పట్టుబడినచో మీకు విముక్తి యింతలో లేదు గాని జయప్రదముగ చౌర్యమొనరించినచో మీకు విమోచనము గల్గింతును' అనెను. వల్లెయని యాచోరాగ్రేసరులు రాత్రి బాగుగా చీకటిపడిన పిదప రామకృష్ణకవి యింటిప్రహరీగోడ దాటి లోనబ్రవేశించి, చిక్కుడు పాదుక్రింద దాగొనియుండిరి.

రామకృష్ణకవి భోజనము చేయుటకు ముందు పాదప్రక్షాళనార్థము దొడ్డిలోనికి వెళ్ళి చిక్కుడుపాదుక్రింద నక్కియున్నదొంగలనుజూచి, లోనికివచ్చి భార్యనగలన్నింటిని భద్రముగ దాచి, భోజనానంతరము తిరిగి దొడ్డిలోనికి వెళ్ళి చేయి కడుగుకొనుచు బిగ్గరగా 'నేమే దొంగలు మనయూరునిండ నిండియున్నారు. నీనగలనుమూట గట్టి యిమ్ము. నూతిలో బారవేసినచో చోరులకు శక్యముకాదు' అని యొకటి రెండు పెద్దరాళ్ళను మూటగట్టి నూతిలో పడవైచి, తలుపువేసికొని, కొంతసేపైనతరువాత మరొక మార్గమున దొడ్డిలోప్రవేశించి, చోరులచేష్టల గనిపెట్టుచుండెను.

ఒకరు నూతికడ నిలువబడియుండగా, నింకొకడు బావిలోనికి దిగి చాలసేపు వెదకి యానగలమూటను కనుగొనజాలక పైకివచ్చి 'ఓరన్నా! బావిలో జల మధికముగా యున్నది. కొంతమైన నీరు తోడివైచినగాని మూటకనబడుటదుర్లభము' అనెను, ఇరువురునుకలసి, ఏతముతోడుటకారంభించిరి. ఎంతతోడినను నీరు తఱిగినట్లు గాన్పించకుండెను. రామకృష్ణుం డెట్టియలుకుడును జేయక మడులుత్రవ్వి యా దొంగలు తోడిననీరు పూలమొక్కలన్నింటిని దడుపునట్లు చేసెను.

తెలతెలవారుచుండెను. ఒకదొంగ మఱల బావిలోనికిదిగి వెదకివెదకి మూటను పైకిదీసివిప్పెను. అందు రాళ్ళు కన్పింపగానే దొంగలు నిస్పృహచెంది రామకృష్ణకవి తమకు తగిన ప్రాయశ్చిత్తమొనరించె నని వెడలిపోవునంతలో రామకృష్ణుడు ఓరీ! చోరులారా! మీ పుణ్యమా యని ఒకటిరెండు మొక్కలుతప్ప పూలమొక్కలన్నియుఁ దడిసినవి. మీధర్మమాయని యారెండు మొక్కలనుగూడ నను నంతలో దొంగలు గోడదుమికి పాఱిపోఁబోయిరి. సరిగా నావేళకా మార్గముననే బోవుచున్న రక్షకభటులు చోరులను బంధించి మఱల కారాగారమునద్రోసిరి. రామకృష్ణుఁడీవృత్తాంతమును రాయలకు దెలిపి, యానందము కలిగించెనట.

---

6 నూరు తప్పులకు ఫర్మానా

రాయలు కొలఁదిపరివారము వెంటరా, కవిబృందముతోఁ గలసి వాహ్యాళికై భద్రానదినిదాఁటి చాలదూరమరిగెను. కనిగిరి పరిపాలకుఁడైన వీరభద్రగజపతి సేనానియగుపసరము గోవిందరాజను దండనాథుఁడు రాయలను బంధించుటకిదియే తగినసమయమనియెంచి, ససైన్యముగ రాయల నెదుర్కొనెను. రాయల ననుసరించియున్న కొలఁదిమంది సైనికులును గోవిందరాజు ప్రతాపాగ్ని కోపఁజాలక పలాయన మవలంబించిరి. రాయలు ధైర్యముతో కవులవంకఁ జూచి 'కవీంద్రులారా! ఈవిషమసమయమున వెనుకంజవేయరాదు. మీరు నాకు విజయము ప్రాప్తించునట్లాశీర్వదింపుడు, క్షణకాలములో గోవిందరాజును కృతాంతమందిరమునకతిథిగా నొనరించివత్తును' అని పలికి శత్రురంగమునకరిగి మెచ్చుట జూచినఁ దానెయై మెలం

గుచు గోవిందరాజు సైనికులు చెల్లాచెదరగు నట్లొనరించెను. అది చూచి గోవిందరాజు రెట్టించిన క్రోధోద్రేకముతో రాయలపై గవిసెను. ఇరువురునుభయంకరముగ పోరాడుచున్న సమయమున రామకృష్ణుడుధైర్యముగ గోవిందరాజు వినునట్లీ క్రిందిపద్యములఁ జదివెను.

'క. బసవనకు బుట్టినప్పుడె
పసరము గోవిందరాజు పసరంబై నగ్
గసవేటికి దినఁడనఁగాఁ
గసవుందిను శత్రులాజిఁ గదిసినవేళన్.'

ఆ పద్యము నిశితశూలమునటె చిత్తమునకు దాకఁగాగోవిందరాజు వెంటనే రుధిరము నోటఁ గ్రక్కుకొని క్రిందబడి విలవిల దన్నుకొనుచుఁ బ్రాణములువిడిచెను. రామకృష్ణుని పద్యము విని గోవిందరాజు విగతజీవుఁడగుటతోడనే తక్కుంగల సైనికులు చెల్లాచెదరై పాఱిపోయిరి. రామకృష్ణుని మహిమకెంతయు నలరి, రాయలు 'రామకృష్ణకవీ! నీమహాత్మ్య మేనెఱుంగనైతిని. ఈవిమయమున కీవు కారణభూతుఁడవు. నీకేమి కావలయునో కోరుకొను' మనగా మన కవి యిట్లనెను—

'మహారాజా! నాపై తమకు దయయున్నఁ జాలును, నా కదియే పదివేలు. తాము కోరుకొనమంటిరిగాన యొక చిన్నవర మడిగెదను. నేను చేయు తప్పులు దినమునకు నూటింటివరకుక్షమించుచుండ గోరెదను. నాకదియే చాలును.

'నూరుకాదు ఎన్నితప్పులైనను క్షమింతును.' అని రాయలు వచించెను. నాటినుండి రామకృష్ణుడు నిర్భయముగఁ గొంటెపనుల జేయుచుండెను.

7 తాతాచార్యుల నవమానించుట

రాయలకు తాతాచార్యులవారియెడ నసమానమగు గౌరవము. రాయలమతగురువాయన. ఈతాతాచార్యులవారి జన్మస్థలము కాంచీపురము. ఈయన మహావిద్వాంసుడు. ఈయన విష్ణ్వంశ సంభూతుఁడని జనులు చెప్పుకొనెడి వారట. ఆచార్యులవారు సంస్కృతమున 'సాత్త్విక బ్రహ్మ విద్యావిలాస' మను గ్రంథమును రచించియుండిరి. చంద్రగిరిలోని వేంకటపతిరాయల సంస్థానమున కీయన తఱచుగా నేగుచుండుటచే రామకృష్ణునకు బరిచయుడయ్యెను తరువాత రాయలయాస్థానమున కేతెంచి విజయనగరముననే స్థిర నివాస మేర్పఱచుకొనెను. రామకృష్ణుడు తాతాచార్యుల వారిని దఱచుగా హేళనము చేయుచుండెను. వైష్ణవమత పక్షపాతియగు తాతాచార్యులవారు స్మార్తమతమునెడల నధికాగ్రహ్యము కలిగి యుండెను. స్మార్తుల నాయన చూడ నొల్లకుండెను. స్మార్తులు కాన్పించినపుడు మొగముపై నుత్తరీయము గప్పుకొనుచుండెను. ఇది చూచి యందరు తాతాచార్యులవారు పరమఛాందసులని చెప్పుకొనసాగిరి. రాయలుకూడ యీవార్తను గర్ణాకర్ణికగ నాలకించి, రామకృష్ణునిరావించి 'తాతాచార్యులవారు ప్రజల యసూయకు బాల్పడుచున్నారు. ఎట్లయినను వారు ఛాందసము వీడునట్లు చేయుమా' యనిరి.

రామకృష్ణు డట్లేయని యొకనాడు తాతాచార్యులవారు యింటికి వెళ్లెను. ఆసమయముననే యాయన యీవలకు వచ్చెను. రామకృష్ణుని జూచి, యుత్తరీయము ముఖమున కడ్డుపెట్టుకొనెను. 'స్వామీ! తాతాచార్యులవారూ! నేను దమ ప్రియ శిష్యుఁడను గదా! నన్ను జూచి మీరేల ముఖమున కుత్తరీయ మడ్డుపెట్టుకొను చున్నారు!' లనియడుగ తాతాచార్యులవారిట్లుసమాధానముజెప్పిరి—

'రామకృష్ణా! నీవు నాకు ముఖ్యుఁడవుగాన నీతో నిజము చెప్పుచున్నాను. స్మార్తమతము బహు పాపిష్టిమతము. స్మార్తుని జూచిన వైష్ణవునకు మఱుజన్మమున గాడిద పుట్టుకయే సంప్రాప్త మగును గావున స్మార్తులఁజూచుట మానివైచితిని' రామకృష్ణు డప్పుడేమియు ననక యూరకుండెను. కొంతకాలము గడచిన వెనుక రాయరు కవులందఱితో గలిసి, నగరము వెలుపలనున్న యుద్యాన వనమునకు షికారువెళ్ళెను. ఉద్యానవనమునఁ జాలసేపు కూర్చుండి వారందఱు నీవలికి రాగా నచట కొన్నిగాడిదలు కాన్పించెను.

రామకృష్ణుడు ఒక్కొక్క గాడిదకడకు బోయి సాష్టాంగ దండప్రణామ మొనరింపసాగెను. రాయలును తదితరులును కడు పుబ్బునటుల నవ్వసాగిరి. రాయలు 'కృష్ణకవీ! నీకు మతిపోయినదా యేమి? ఎవరైనను గాడిదెలకు మ్రొక్కుదురా?' యనగా, రామ కృష్ణుఁడు ప్రభువర్యా! నే నెన్నడు నర్థములేని పనిచేయను. ఈ గాడిద మన తాతాచార్యులగారి నేనమామ కందాళై తిరుచూర్ణా చార్యులుగారు. ఈ గాడిద మన యాచార్యులవారి తాతయగు పర్వటం అళహసింగరాచారిగారు. తక్కుంగల ఖరములన్నియు వీరి బంధువులే వైష్ణవమతాగ్రేసరులకు వీరికి మ్రొక్కి నాయఘు వినాశ మునకై ప్రయత్నించుటయే తప్పగునా? తాతాచార్యులవారు కూడ నీ మధ్య స్మార్తుల మొగము చూచుట మానినారుసుడీ యనెను.

తాతాచార్యులు సిగ్గుపడి యా దినము మొదలట్లు చేయుట మానెను. రామకృష్ణుని యుక్తికి సంతసింపనివారు లేరు.

8 సమస్యా పూరణము

భట్టుమూర్తియను నామాంతరముగల కాకమాని రామరాజ భూషణుఁడు రాయల యాస్థానములోనున్న యష్టదిగ్గజములలో నొకడు. రాయలు రామకృష్ణునియెడ నాదరాభిమానములు గలిగి

యున్నాడని యీర్ష్య చెంది యొకనాడు సభలో నందఱు నుండగా, రామకృష్ణుని కెట్లయినఁ బరాభవము సేయవలెనని యిట్లనెను.

'అయ్యా! రామకృష్ణకవీ! నేనొక సమస్య నిచ్చెదను. ఆద్దానిం బూరించి, నీవు సత్కవివని, వికటకవివని సార్థకనామ ధేయుండ వగుదువుగాక!' కుంజరయూథంబు దోమకుత్తుకఁ జొచ్చెన్.

రామకృష్ణుఁడు భట్టుమూర్తి తన్నవమానించుటకే యిట్టి సమస్య నిచ్చినాఁడని కోపముతో నిట్లు పూరించెను.

'క. గంజాయిఁద్రావి తురకల
సాంగత్యముఁగూడి కల్లుచవిఁగొన్న హా
లంజలకొడుకా యెక్కడ
కుంజరయూథంబు దోమకుత్తుకఁ జొచ్చెన్.'

రామరాజభూషణుఁడు చిన్నబుచ్చుకొని కూర్చుండుట గాంచి రాయలు 'రామకృష్ణా! ఆపద్యము నట్లు చెప్పఁజనదు. భారతపదముగా జెప్పు'మన నతఁడిట్లు చెప్పెను.

'క. రంజన చెడి పాండవులరి
భంజనులై విరటు గొల్వఁబాలైరకటా!
సంజయ విధి నేమందును
కుంజరయూథంబు దోమ కుత్తుకఁ జొచ్చెన్.'

---

9 భారతరచన

అల్లాయుద్దీన్ గంగోబహామనీ భామినీరాజ్యమును, బరిపాలించిన పిదప నేదులశాహి రాజ్యమున కధికారియయ్యెను. ఏదులశాహి తాతయగు, కుతుబ్ శాహి నాదిండ్ల అప్పామాత్యుఁడు రచించిన తపతీ సంవరణోపాఖ్యానము నంకితమందెను. బాల్యమునుండియు నేదులశాహి తానుకూడ గ్రంథములకృతిభర్తృత్వము నందవలయు

నను కుతూహలము కలిగి యుండెను. విజయనగర విజాపుర సామ్రాజ్యములవా రిరువురునుగూడ సరిహద్దులగూర్చి తగాదాపడుచుండిరి. విజాపురము సరిహద్దుగా నుండవలయునని, విజయనగర సామ్రాజ్యాధిపతులును తుంగభద్రానది సరిహద్దుగానుండవలెనని ఏదులశాహియు వివాదపడుచుండిరి. ఈవివాదము తుదకు భయంకరసంగ్రామముగాఁ బరిణమించెను. ఆ రణంబున రాయలసైన్యాధిపతులు, సైనికులు కొంద రేదులశాహిచే ఖైదీలుగా పట్టుకొనబడిరి, వారి విమోచనమునకై రాయ లేదులశాహితో సంధికొడంబడవలసివచ్చెను. ఇర్వురు రాజ్యాధిపతులును దమకు రాయచూరు సరిహద్దుగా నుండవలయునని నిర్ణయించుకొనిరి, ఆసంధిలో ఏదులశాహి, రాయలు తన యాస్థానకవులచే భారతము వారముదినములలో వ్రాయించి, యంకితమీయవలయునని కూడ నేర్పఱచెను. ఏదులశాహి కోరికప్రకారము వారమురోజులలో భారతము పూర్తిచేయవలయునని యాస్థానకవులతో ఖండితముగాఁ జెప్పెను.

పదునెనిమిది పర్వములు గలిగి, పంచమవేదమని ప్రసిద్ధినొంది యున్న భారతమును వారమురోజులలో వ్రాసి అందులో ఏదుల శాహి పాండవులుగను, నాతనివిరోధియగు నైజాముల్ముల్కు కౌరవులుగను, వర్ణించి వ్రాయుట యసంభవమని పెద్దనాదులు తలపోసి, నిరాశచెందిరి. తమవలనఁ గాదనిచెప్పినచో దమకుఁ దప్పక దేవిడీ మన్నాయగునని యెఱింగిన యా కవులొకరినొకరు 'నీ వలననేయిది జరుగవలె'నని యనుకొనితుదకుఁ తెనాలిరామకృష్ణునిసలహాయడుగుటకు నిశ్చయించుకొనిరి. నాలుగుదినములు గడచిపోయెను. పెద్దన, పింగళిసూరన్న రామకృష్ణునికడ కరిగి 'రామకృష్ణకవీ! ఇన్నాళ్ళును రాయల యాస్థానమున గౌరవముగనే కాలక్షేప మొనరించితిమి. ఇప్పుడు మీఁదుమిక్కిలి వచ్చినది. ఆదిక్కుమాలిన ఏదులశాహి పేర భారతము వ్రాయవలయునని రాయలు నిష్కర్షగా చెప్పెను. ఏమి చేయుటకును దోచకున్నది,'' అనగా, రామకృష్ణుడు 'పెద్దనకవీంద్రా!

ఇందుల కంతగా విచారింపవలయునా? ఏమివెఱ్ఱి! మీరు నిర్వి చారులై యుండిన నేను జెప్పినట్లు చేయుడు. మీమర్యాద నా మర్యాద కూడ దక్కించుకొనును, వేయిబండ్ల తాటియాకు కొట్టించి, సంచికలుగా దయారు చేయింపుడు అనెను. పెద్దన సంతోష భరి తాంతరంగుడై యట్లే చేయించెను.

ఏడవరోజున రాయుల సెలవుగొని, రామకృష్ణుడు పెద్దనాది కవీంద్రులందఱితోఁ గలిసి, విజాపురమునకు బోయెను. కవుల నపరి మితముగ గౌరవించి, ఏదులశాహి భారతము కృతినొందుట కువ్వి ళ్ళూరుచుండెను. ఒకనాటి యుదయమున నాతడు కవులను రావించి సుఖాసనాసీనులగావించి యిట్లు ప్రశ్నించెను—

'పండితులారా! భారతం రచించి తెచ్చినారా?'

'రామకృష్ణుడు లేచి యిట్లు ప్రత్యుత్తరమిచ్చెను.

'సర్కార్! తమ హుకుం ప్రకారము పూర్తిచేసి తెచ్చినా రము వ్రాయుట వారమురోజులలోఁ బూర్తియైనది గాని చదువుట కథమొక సంవత్సర మగును.'

'మమ్ము పాండవులుగనే వర్ణించినారా?'

'అవునట్లే వర్ణించినాము'

'మాశత్రువగు నైజాముల్ముల్కునో—'

'కౌరవులుగా వర్ణించినాము'

'అచ్ఛా! చాల సంతోషముగా నున్నది. అయితే ఎప్పుడు మొదలు పెట్టెదరు?'

'కాని ప్రభూ! ఒక్క సందేహముతోచి, చిట్టచివర కొంత పూర్తిచేయకుండ నుంచినాము. మాటిమాటికి మాకా సందేహము కలిగి చాలచోట్ల నేమియు వ్రాయక యట్లె యుంచినారము. ఆ సందేహము నివృత్తి చేసినచో నరగంటలో బూర్తిచేసి, వినిపిం తుము.'

'ఆ సందేహమేదో చెప్పండి.'

'సర్కార్! నైజాముల్ముల్కు గారిని, వారి సోదరులను కౌరవులుగా వర్ణించితిమి. తాము పాండవులని వ్రాసితిమి. పాండవులైదుగురు సోదరులు. ఆయైదుగురకు భార్య ద్రౌపది, తాము ధర్మరాజని వ్రాసితిమి. తమ జనానా వారిని ద్రౌపదిగా వ్రాసినాము అయితే తమ జనానావారికి భీమార్జున నకులసహదేవుల నెడి మిగత నలుగురు భర్తలుగ నెవరిని వ్రాయవలయునో తోచకున్నది. ఈ విషయమై తమరెట్లు సెలవిచ్చిన నట్లు వ్రాయుదుము.'

ఏదులశాహి నాపాదమస్తకము క్రోధమనలముభంగి దహించెను. 'ఛీ తూ! అరే ఏం భారతంబే మీరాది, ఒక్క ఆడదానికి అయిదుగురు మొగుళ్ళు, మాజనానాకింకా నల్గురు మొగుళ్ళు కావాలీ హైతో మీభారతం అ కితిమువద్దు కంకితమువద్దు వెంటనే తగులబెట్టు'డను నరికి రామకృష్ణుడు 'చిత్తము సర్కార్! అట్లే చేయించెద'నని యాసేయబడ్డ తాటియాకును నిశ్శేషముగం దగులం బెట్టించెను. అంతయు భస్మీభూత మయినపిదప నేదుల శాహి కడ కరుదేగి 'సర్కార్! తమ యాజ్ఞానుసారము తగులబెట్టించితిని అనెను. ఏదులశాహి పరమానందమును నొంది, యాపండితులకు శ్రమయిచ్చి నందులకు నొచ్చుకొని పిక్కు బహుమానములిచ్చి వీడ్కొలిపెను. రాయ లిదియంతయుం దెలిసికొని కడుపు చెక్కలగు నట్లు నవ్వెను.

---

10 కుంకుమ భొట్లు

చేర దేశమునుండి కుంకుమభొట్లు అనుజగ దేకవిఖ్యాతినార్జించిన పండితుండు రాయల యాస్థానమందలి యష్టదిగ్గజములను జయించు తలంపుతో నేతెంచెను. ఆతండు రాయలను సందర్శించి యాస్థాన విద్వాంసులతోడి వివాదమునకుం దన కవకాశమిమ్మని కోరగా,

రాయలు సరేయని యొకదినము నిర్ణయించెను. వివిధబిరుదవి రాజితుం డగు కుంకుమభొట్లు తమ్ము గెలచినయెడల రాయలు తమ్ము గౌర వించుట మానునని భయముఁజెంది పెద్దనాదికవులు రామకృష్ణునిఁ జేరి 'వికట కవిశిరోమణీ! ఈ కుంకుమభొట్లు మనల గెలువజాలని యుపాయ మూహించి, మన గౌరవము కాపాడుమా' యనిరి.

రామకృష్ణుఁడట్లేయని, యానాటి సాయంకాలము నొకదువలె మాలువేషము ధరించి, కుంకుమభొట్లు బసచేసియున్న యింటి యరుగుపై కూర్చుండెను. కుంకుమభొట్లింటనటు పచారు చేయు చుండఁగా, నాతండు వినునట్లు రామకృష్ణు డీపద్యమును చదివెను—

శా. సమర్థకుమ! ధీనిబంధన విధానంక్రందనాచార్య శూ
రమ్మన్యాచల వజ్రపాత! జగవీరకాంబుజాకా! శర
ధ్యమ్మాగ్రస్థ దశాశ్య రాజ్యనమసహ్యాంకో విశ్వవాతీరభా
గుమ్మత్తూరి శివంసముద్ర పురవప్రోన్మూలనాడంబరా!'

ఆపద్యము నాలకించి, కుంకుమభొట్లు 'ఈతెడెవ్వడు? వేషమును బట్టి సేవకునివలెఁ గాన్పించుచున్నాఁడు. అయినను మాట్లాడించి, చూచెదగాక, యని 'ఓరీ! నీ వెవ్వడవు? అని యడుగ నాతడిట్లు సమాధాన మిచ్చెను—

'అయ్యా! నేను తెనాలి రామకృష్ణకవిగారి సేవకుడను'

'ఓహో! అటులనా? నీవు రామకృష్ణకవిగారి పరిచారకుడవా? బాగుబాగు నీ యజమానికూడ ఆస్థానమందలి యష్టదిగ్గజములలోని వాఁడేనటకదా?'

'అవును. ఆయనకడనే నేను కవిత్వము చెప్పుట నేర్చుకొంటిని'

'సరే ఏదీ మఱియొక పద్యము జదువుము.'

మాయవేషముననున్న రామకృష్ణుఁ డీపద్యమును జదివెను.

క. నరసింహు కృష్ణరాయని
కరమరుదగు కీర్తికాంత కరిభిద్గిరిభి

త్కారి గరిభిద్గిరిగిరభి
త్కారి భిద్గిరిభిత్తురంగ కమనీయంబే.'

కుంకుమభొట్లు 'ఓరీ! ఆపద్యమున కర్థము చెప్పగలవా? యని ప్రశ్నింప, రామకృష్ణుం డిట్లుఁ జెప్పెను.

టీ. నరసింహ=సాళువ నరసింహరాయల, కృష్ణరాయ=అతని కుమారుడైన శ్రీకృష్ణ దేవరాయల, కీర్తి=ప్రసిద్ధి, కరభిత్=గజాసురుని వధించిన శివునివలెను, గిరిభిత్కారి=పర్వతముల పెకలించిన యింద్రుని యేనుగయగు నైరావతమువలెను, కరిభిద్గిరి=సాంబశివుని నివాసముండు కైలాసశైలమువలెను. గిరిభిత్కారిభిత్తురంగ=యింద్రుని యొక్కయు, సీశ్వరునియొక్కయు వాహనములైన యుచ్చైశ్రవము గోవృషభములవలెను తెల్లనికాంతి గల్గియున్నది.

'రామకృష్ణుని పరిచారకుడే యిట్టి యసాధారణపాండితీప్రకర్ష గలిగియుండగా, రామకృష్ణకవి యెట్టి ప్రజ్ఞాధురంధరుండో, యష్టదిగ్గజములం దగ్రగణ్యుండై యొప్పు పెద్దనముందు నే నసలు నిలువబడగలనా' యని తలంచి యధైర్యమునొంది, యారాత్రియేరికిని దెలియకుండ నెటకో వెడలిపోయెను.

మఱునా డాస్థానమున రాయలుకూర్చుండి, కుంకుమభొట్లు నాహ్వానించుటకై భటులనంపగా వారు తిరిగివచ్చి 'మహారాజా! ఆ పండితుడు గతరాత్రముననే నగరమువిడిచి వెడలిపోయెనట' యని చెప్పిరి. రామకృష్ణుడు తానొనరించినదంతయు నెరింగింపగా రాయలు మిక్కిలి సంతోషించి సన్మానించెను. తమ యాందోళనము బాపినందులకు పెద్దనాదులెల్లరును రామకృష్ణకవిని విశేషముగా నభినందించిరి.

---

11 ప్రెగడరాజు నరసరాజు

ప్రెగడరాజు నరసరాజనుకవి యొకప్పుడు కృష్ణదేవరాయల యాస్థానమునకేగి 'మహారాజా! తమ యాస్థానముననున్న పెద్దన్న'

ధూర్జటి, రామరాజభూషణుడు మున్నగు కవులందఱికంటె మిన్నగ నాశుకవిత్వముం జెప్పుదును వారిపద్యములందుఁ దప్పులుపట్టి చూపింతును. ఎట్టిపద్యమైనను, నెంతకఠినముగానున్నను దప్పులేకుండ వ్రాసి చూపింతును, అని చెప్పెనట రాయలు సరేయని సమ్మతించెను. పెద్దనాదికవు లొకరిమొగమువంక నొకరు చూచుకొనుచుండ, రామకృష్ణకవిలేచి, 'అయ్యా! నరసరాజకవీ! గొప్పవ్రాఁతకాఁడనని చెప్పుచున్నావు? నేనుచెప్పు పద్యమును వ్రాసెదవా? అని యడిగెను.

'ఓహో! నిస్సంశయముగా వ్రాయుదును.'

రామకృష్ణుఁ డంతట నీక్రింది పద్యమును జదివెను.

"క. తృవ్వట బాబాతలపై
బువ్వట జాబిల్లి వల్వబూచట! చేదె
బువ్వట చూడగను హాళు
క్కవ్వట తలఁపంగ నిట్టి హారునకు జేజే"

చిత్రోచ్చారణముగల యాపద్యమును నరసరాజు వ్రాయజాలక పోయెను. "సరే! వ్రాతలోని నీ పస తేలినదింక మఱొక్క పద్యము జెప్పెద నర్థము చెప్పు" మని రామకృష్ణుఁడీపద్యము జదివెను.

"మ. కన నీహారగు పద్మపత్రధళరంగతీకార్తి! చాఃఖాకమ
ద్ధనశుక్రాక్షికశేభరాణ్మ్రగపతీ! త్రైలోక్యదామోదరా
యనగా శంకరవాంఛితార్థకృపదివ్యాస్తోకం పాఃసీజనా
ర్థన వాహిప్రద! వైరివిగ్రహముకుంఠా! మిత్రవింధాధిపా!"

నరసరాజు "రామ రామ! ఇటువంటి యపశబ్దములను వినిన పాతకము వేయిజన్మములకైన తొలగదు" అనగా రామకృష్ణకవి "ఓహో! ఈ మారు నీపాండిత్యమంతయు వెల్లడియైనది, సుశబ్దములు నీకపశబ్దములయ్యెనా? సరే నేనర్థము చెప్పెద నాకర్ణింపుము.

టీ. కనన్ = చూడగా, నీహార = హిమమువలె, గు = తేజరిల్లు చున్న, పద్మపత్ర = తామరపత్రములవలె, ధళ = తెల్లనైన, రంగత్ = ఒప్పుచున్న, కీర్తి = ప్రశస్తిగలవాడా, చాణూరమత్ = చాణూరుడను వానిని, హన = వధించినవాడా, శుక్రాక్షికళ = తెల్లనైన నేత్రములు గల కాళిందుడకు, ఇభరాట్ = గజరాజునకు, మృగపతీ = సింహసమానుడా, త్రైలోక్య = మూడులోకముల, ధామ = నివాసస్థానమైన, ఉదరా = ఉదరముగలవాడా, శంకర = శంకరునియొక్క, పాదపద్మయుగ, దివ్యాస్త్రోరపాణే = పాదపద్మముల భజించు, కరములతో = నొప్పువాడా, అనగా = అని చెప్పగా, జన = జనులయొక్క, అర్థ = కోర్కెల, నవ = క్రొత్తవైన, హిం = హితముల, ప్రద = ఒసగువాడా, వైరి = శత్రువుల, విగ్రహా = పొందినను, ముకుందా = పోగొట్టువాడా, అధిపా = ఓప్రభూ, మిత్ = మృత్యుదేవతను, రవింధా = ఆజ్ఞాపింపుము.

తా. ఓ కృష్ణా! నిన్ను భక్తియుక్తులై గొల్చువారి హితాభిలాషివై, మృత్యువును దూరమొనరింతువు. అనఁగా దీర్ఘాయుష్మంతులుగాఁ జేయుదువు.

నీకీ మహార్థప్రతిపాదకమైన పద్యము రుచింపక పోయెనా?

చ. తెలియనివన్ని తప్పులని దిట్టతనాన సభాస్థలంబునన్
బలుకగరాదునోరి, పలుగాకిబిసాచపుపోడగట్ట నీ
పలికిననోట దుమ్ముపడ! భావ్యమెఱుంగక పెద్దలైనవా
రల నిరసింతురా! నిను మురా! నరసా విరసా! తుసా! భుసా.

చ. ఒకనికి విద్యమందెనయు నొప్పులు తప్పులు; నాకవిత్వమం
దొకనికితప్పు! బట్టపనియుండదు! కాదని తప్పుబట్టినన్
మొగమటు క్రిందుగాదిగిచి మొక్కలువాసిన యంపకత్తితో
సిక మొదలంటఁగోతు మఱిచెప్పినగొట్టుదు మోముదన్నుచున్.

నరసరాజు సిగ్గుపడి, మాఱుమాటాడకుండ వెడలిపోయెను. కొలఁదిదినములు గతించినపిదప రాయలు తన తనూజయగు తిరుమ

లాంబతోఁ బదరంగ మాడుచుండగా, బంటు రెం డేనుఁగులమధ్య నిలుచుకొంటఁజూచి తిరుమలాంబ 'యుద్ధతుల మధ్యమునఁ బేదకుండ దరమె' యని బంటులు పైకి ద్రోసెను. రాయలు 'నీకీ పద్యపాద మెటనుండి లభించినదని' యడుగఁగాఁ దిరుమలాంబ 'నేనీపద్యమును నాలుగు దీనారములిచ్చి కొంటిని' అని, యిట్లు చదివెను.

'గీ. ఒత్తుకొనివచ్చు కటికుచోద్వృత్తి చూచి
తరుణి తనుమధ్య మెచటికో తలఁగిపోయె
నుండెనేనియుఁ గపడకున్న యహహ
యుద్ధతుల మధ్యమునఁ బేదకుండ దరమె'

'అయ్యో! ఆపద్యమునకా నాలుగు దీనారములు వెలయా? నూఱుదీనారము లిమ్ము' అనగా తిరుమలాంబ నరసరాజునకుఁ గబురంపి నూఱుదీనారము లొసంగి గౌరవించెను. తాను వ్రాసిన హరిశ్చంద్ర నలోపాఖ్యానమును ద్వ్యర్థికావ్యమును వినవలసినదని రాయల నాతఁడు కోరఁగా, విని హరిశ్చంద్రనలోపాఖ్యాన మనరాదనియు నల హరిశ్చంద్రోపాఖ్యాన మని యుండవలయు ననియుఁ జెప్పి, యనేక రీతుల సత్కరించి, వీడ్కొలిపెను.

నరసరాజుని యుపాయమున కందఱు సంతోషభరిత హృదయాంతరులైరి,

కవితా ప్రసక్తి

శ్రీకృష్ణదేవరాయలొకనాఁడు సభాస్థలి గూర్చుండి, కవులెల్లరును వినునట్లు రామకృష్ణుని జూచి 'కవివరేణ్యా! పెద్దన కవీంద్ర విరచితమైన మనుచరిత్రమున తిమ్మన్నకవి రచించిన పారిజాతాపహరణమున రామరాజభూషణుని వసుచరిత్రమున నొకేసందర్భమున వ్రాయఁబడునట్లుండు నీ క్రింది పద్యములోని కవితామాధుర్యమును గ్రోలి. నీయభిప్రాయముఁ దెలియఁజేయవలయును.

'ఉ. పాటునకింతులోర్తురె కృపారహితాత్మక; నీవు దోపని
చోటను భవన్నఖాంకురము సోఁకెఁ గనుంగొనుమంచుఁ జూపియ
ప్పాటలగంధి వేదననెపంబిడి యేడ్చెఁ గలస్వరంబుతో
మీటునవిచ్చు గబ్బిచను మిట్టల నశ్రులు చిందువందగన్.
(మనుచరిత్ర)

'ఉ. ఈసునబుట్టి డెందమున హెచ్చిన కోపదవానలంబుచే
గాసిలియేడ్చెఁ బ్రాణవిభుకట్టెదురన్ లతాంగి పంకజ శ్రీ
సఖమైన మోముపయిఁ జేల చెరంగిడి బాలపల్లవ
గ్రాసకషాయకంఠకలకంఠవధూకల కాకలీధ్వనిన్.' (పారిజా)

శా. ఆజాబిల్లి వెలుంగు వెల్లికలడాయన్ లేక రాకా నిశా
రాజశ్రీ సఖమైన మోముఁ జటాగ్రంబొత్తి యెల్గెత్తి యా
రాజీవానన యేడ్చెఁ గిన్నరవధూ రాజత్కరాంభోజకాం
భోజీమేళవిపంచిసుధాపూరవంబు తోరంబుగాన్.' (వ.చ)

రామకృష్ణకవి 'మహారాజా! చెప్పుట కేమున్నది? పెద్దన్న గారియేడ్పు అటు యిటూ ఉన్నది. ముక్కుతిమ్మన్నగారి యేడుపు ముద్దుముద్దుగా నున్నది. భట్టుమూర్తిగారు మాత్రము భోరుమని యేడ్చినారని నేను అందరును గడుపులుబ్బునట్లు నవ్వెరి. భట్టుమూర్తి కిఁ గోపమువచ్చి, చుర చుర జూడసాగెను. రామకృష్ణకవి 'ఓభట్టు మూర్తీ! నీకవిత్వముఁగూర్చి నేనట్లు విమర్శించినానని కోపగించి నావు కాఁబోలు' నని యీక్రిందిపద్యములఁ జదివెను—

'క. చీఁపర పాఁపర తీఁగల
జేఁపలబుట్టల్లినట్లు చెప్పెడి నీయా
కాఁపుఁ గవిత్వపుఁ గూతలు
బాపనకవివరుని చెవికిఁ బ్రమదం బిడునే?'

శా. అద్రిస్నిగ్ధతలంబు బుద్బుదము లుద్యద్దారు భూపావళుల్
తుద్రాదుంబర పాకపక్వఫలముల్ శుత్త్యంతరాకాసముల్

రుద్రాక్షాక్షర పంక్తివిభ్రమము లీరూఢిన్నిరూపింప నీ
శూద్రప్రజ్ఞలు విప్రవిత్కవి వచస్స్ఫూర్తిన్విడంబింతునే!
క. కెంగేల రామకృష్ణుని
బంగరు కడియంబు లుండఁ బడితెఁ డగునా
జంగులు జల్లులు గల్గిన
సింగారపు టూరకుక్క సింగంబగునా!

---

13 అమవసనిశికిన్

శ్రీకృష్ణదేవరాయ లొకనాఁటి మధ్యాహ్నమున నిండు పేరోలగంబుండి.

'క. కలనాటి ధనములక్కఱ
గలనాఁటికి దాచ కమల గర్భుని వశమా'

యని చదివి, మిగత రెండుపాదములనుబూర్తి చేయుమనఁగా నలసాని పెద్దనకవి లేచి,

'నెలనడిమనాఁటి వెన్నెల
యలవడునే నాడుఁబోయ నమవసనిశికిన్'

ఆపద్యము నాకర్ణించి, రామకృష్ణుఁ డిట్లు జదివెను—

క. ఎమితిని సెపితివి కపితము
బ్రమపడి వెఱిపుచ్చకాయ వడిఁదిని సెపితో
ఉమెతకయను దిని సెపితే
యమవసనిశి యన్నమాట నలసని పెదనా!

'అమవస నిశికిన్' యను ప్రయోగము మంచిదికాదను నుద్దేశముతో రామకృష్ణకవి యిట్లాక్షేపణం బొనరించెను. పెద్దన కుత్కృష్టత నాపాదించుచు దనకు నికృష్టత నాపాదించుకొని రామకృష్ణుఁ డిట్లు పద్యముఁ జెప్పెను--

'క. కవి యల్లసాని పెద్దన
కవితిక్కన సోమయాజి గణుతింపఁగాఁ
కవి నేను రామకృష్ణుఁడ
కవియను నామంబు నీటికాకికి లేదే'

---

14 ఆనందభట్టు

రాయల యాస్థానమున కొకనాఁడు తిట్టుకవిత్వమునందు ప్రజ్ఞ గల యానందభట్టు అనుకవివచ్చి తన్నుగూర్చి చెప్పుకొనెను. రాయలా కవిత్వము విననొల్లక, యేదో కొంతధనము బహూకృతిగానిచ్చి వేయ దలంచెను. ఆనందభట్టీ పద్యమును జదివెను.

'ఉ. బూతుకవిత్వ వైఖరుల పోడిమి జూడక పొమ్ము పంగ నీ
కేతగుగాక, యిట్టులను తెవ్వరు సెప్పుదురో నృపోత్తమా
చాతురితోఁ దెనాలి కవిసత్తముఁ డీతఁడు రామకృష్ణుఁడీ
రీతిని యూరకుండిన విరించినినైన జయింప జాలనే?

రామకృష్ణుఁ డంతవఱకు రాయలేమనుకొనునో యని మాటాడక యూరకుండెను. ఇఁక సహింపఁజాలక యతఁడు లేచి 'చూతుమె లవుఁడా యటంచు సూక్తులు పలికెన్' అను సమస్యనిచ్చి పూర్తి చేయుమనియెను. ఆనందభట్టు ఆ సమస్యను బూర్తి చేయఁజాలక పోయెను. రామకృష్ణకవియే యిట్లు పూర్తి చేసెను—

'క. ఆతురపడి యెదిరించితి
వాతతబలశాలి రాముఁడనె తనయునితో
సీత, రఘురాము సదృశుని
జూతుమె లవుఁడాయటంచు సూక్తులు పలికెన్.'

ఆనందభట్టు ప్రమోదమంది యిట్లనెను—

ఉ. అర్ణవవేష్టితాఖిల మహామహి మండలమందు బూతునన్
బూర్ణుఁడు రామకృష్ణకవిఁబోలు కవీశ్వరుఁ డొండుగల్గునే
నిర్ణయమెంచిచేయు మహనీయగుణాన్వితుఁడు బూతుమంచిగా
దుర్ణయుఁడైనచో దివిరిభూర్తమంచిని బూతుచేసెనున్.

15 పెద్దన కవిత్వము నాక్షేపించుట.

విద్వత్కవు లెల్లరును గూర్చుండి యుండగా రామకృష్ణుఁడు నిలువబడి రాయలు నుద్దేశించి, 'మహారాజా! నాతో భక్తిరసాత్మకములగు బద్యముల నాశువుగా నెవరును చెప్పలేరని ఘంటాపదముగా జెప్పగల' ననెను— రాయలు రామకృష్ణకవీ! భక్తిరసోజ్జ్వలములగు పద్యములఁ జెప్పుము. అప్పుడు నీకంటె యుత్తమునుగ నెవరైన నట్టి కవిత్వము జెప్పగలవారుందురో, ఉండరో నిర్ధారణ చేయవచ్చును. రామకృష్ణుఁ డిట్లు చదివెను—

" ఆ. వె. లచ్చిమగఁడ! నీకు లక్షనమస్కృతుల్
సీతమగఁడ! నీకు సేవఁజేతు
సత్యభామమగఁడ సన్నుతించెద నిన్ను
మిత్రవిందమగఁడ మేలొసంగు
లక్షణకు మగండ లాలింపరా నన్ను
నీలమగఁడ నాకు నీవె దిక్కు
జాంబవతికి మగఁడ జాలంబుసేయక
వెల్లిమగఁడ నన్ను నేలికొనర!"

రాయలు "ఓహో! మిక్కిలి భక్తిరసాంచితమై యున్నది" యని నాక్షేపణపూర్వకముగా ననఁగా రామకృష్ణుఁడు "మహారాజా! తాము నన్ను హేళనఁ జేయనక్కఱలేదు. లోకములో బురుషునకు

నతికంటెఁ బ్రియతమంబగునట్టి దేదియును లేదు. మన పెద్దన కవిశేఖరుఁడు తన్నెట్లు వర్ణించెనో మఱచిపోయినారా?

" శ్రీ వేంకటగిరివల్లభ
సేవాపరతంత్రహృదయ! చిన్నమదేవీ
జీవితనాయక! కవితా
ప్రావీణ్యఫణీశ! కృష్ణరాయమహీశా!

చిన్నమదేవీ జీవితనాయక, యని పెద్దనగారనినప్పుడు తాము నితాంతసంతోషతరంగిత హృదంతములు కాఁగా లచ్చిమగఁడ యని నపుడు శ్రీమన్నారాయణుఁ డుప్పొంగ, నల్లిమగఁడని పిలుచుకొన్నపుడు నేను బ్రహ్మానందము నొందియుండఁగా మిత్రవింద మగఁడ యన్నపుడు శ్రీకృష్ణుఁ డెట్టి యానందము నొందియుండునో శ్రీవారే యూహింతురుగాక!" యనెను. అందఱు నాతని చమత్కారమున కబ్బురమందిరి.

16 ముక్కు తిమ్మన్న.

రాయ లొకనాఁడు రామరాజభూషణునిజూచి, 'కవీ! స్త్రీ సౌందర్యమును వర్ణించుచు జక్కనిపద్యమును జెప్పుమా!' యనెను. భట్టుమూర్తి యీపద్యము జదివెను.

'శా. నానాసూనవితానవాసనల నానందించు సారంగమే
లానన్నొల్లదటంచు గంధఫలి బల్ కాకం దపంబంది యో
షా నాసాకృతిబూని సర్వసుమనస్సౌరభ్యసంవాసమై
పూనెం బ్రేంక్షణమాలికా మధుకరీపుంజంబు లిర్వంకలన్.'

రాయలు 'భట్టుమూర్తీ! నీకవితామాధురి యత్యంతమధురముగ నున్నది. నీకు వేయి దీనారములు బహుమానముగ నిచ్చితిని' అని వేయి దీనారముల నిచ్చెను.

రామకృష్ణకవి లేచి 'మహారాజా! మీరు సకలవిద్యావిశారదులు రాజ్యపరిపాలనా ధురంధరులు కావుననే పద్యమునకు సరియైన వెల నిర్ణయించినారు. ఈపద్యమును భట్టుమూర్తి వ్రాయలేదు. వేయి దీనారములకు మన తిమ్మనకవిగడ గొనెను. మీరు వేయికిబైన నేమైన నిచ్చినగదా మన భట్టుమూర్తికి లాభము?'' అనెను. భట్టుమూర్తి సిగ్గుపడెను.

మఱొకనాడుతిమ్మనకవియింటివద్దనందఱునుగూర్చుండికవితాగోష్ఠి గావించుచుండగా నామార్గమున బోవుచున్న భట్టుమూర్తి వారందఱును వినునట్లు తన శిష్యునుద్దేశించి—

క. వాకిట కావలి తిమ్మన
వాకిట కవికోటి మాధవా కిటకోటే.'

యని, తిమ్మన వాకిట గూర్చుండిన కవులసమూహము వరాహముల సమూహమును బోలియున్నదను నర్థము వచ్చునట్లు చదివెను. రామకృష్ణుడా దారినిబోవుచు నది విని—

'క. ప్రాకృత సంస్కృత ఘూర్జర
మూకీకృతకుకవితుంగ ముస్తాతతికిన్
వాకిట కావలి తిమ్మన
వాకిటి కవికోటిమాధవా! కిటకోటే.'

ప్రాకృత సంస్కృత, ఘూర్జర భాషలమిశ్రమము చేసి, కవనము చెప్పునట్టి కుకవులనుతుంగముస్తలపాలిటికి దిమ్మనవాకిటనున్న కవులందరును వరాహములవంటివారేయను భావము వచ్చునట్లు చదువగా భట్టుమూర్తి సిగ్గుపడెను.

మఱిరెండు రోజులు గడిచినపిదప, ముక్కుతిమ్మనయొకనాడు తనయింటి చావడిలో గూర్చుండి ఊయెలలో నుల్లాసముగ నూగుచుండగా రామకృష్ణుడేగి 'మామా! ఊతునా! యనెను. ఊయల

మూపును కొంబోలునని భావించి, తిమ్మన ఊఁ యనెను. వెంటనే వికటకవి తిమ్మనమోముపై నుమిసెను ఆగ్రహావేశమునొంది 'ఓరి నీకేమి పోగాలము రా? నిన్ను మియుమంటినా? యని తిమ్మన గర్జింప, 'అవును మామా! ఊతునా? యని నిన్నడిగియే గదా నేనుమిసినాను, అని, రామకృష్ణుడు ప్రత్యుత్తరమిచ్చెను. కోపమాపుకొనజాలక తిమ్మనకవి యూయలపై నుండియే రామకృష్ణుని మొగముపై శక్తికొలది తన్నెను. ఆ తాపునకు రామకృష్ణుని దంతమొకటి యూడిపోగా, నాతడు యింటికి బోయి దుప్పికొమ్ము నరుగదీసి పన్నుగా నమర్చుకొనెను ఆసంగతి రాజు రాజభూషణుడు తెలిసికొనెను నాటి మధ్యాహ్నము కొలువుకూటమున రాయలు 'రవిగాననిచో కవిగాంచునే కదా!' యనుసమస్యను పూర్తి చేయుమనెను. భట్టుమూర్తి యిట్లు పూర్తి చేసెను.

ఉ. "ఆరవి వీరభద్రచరణాహతిఁదూలిన బోసినోటికిన్
నేరడు రామలింగకవి నేరిచెఁబో మన ముక్కుతిమ్మన
క్రూరపదాహతిం దెగిన కొక్కెఱపంటికి దుప్పికొమ్ము ప
ల్గా రచియించెనౌర! రవిగాననిచో కవిగాంచునే కదా!"

రాయలాపద్యభావమును గూర్చి యాలోచనాధీనుఁడై యుండగా భట్టుమూర్తి జరిగినదంతయు జెప్పి రాయల కాహ్లాదము గలిగించెను.

---

17 కవి గండపెండేరము

కృష్ణరాయలొకనాడు బంగరుపళ్ళెరమున గవిగండపెండేరమును దీసికొనివచ్చి, గీర్వాణాంధ్రములందునమోఘముగా కవిత్వము జెప్పువారికి గవిగండపెండేర మీయఁబడునని చెప్పగా కవులందఱు నాలోచనాధీనులై యుండగా, రాయలు మఱల నిట్లనెను—

ఉ. "ముద్దుగ గండపెండియరమున్ గొనుడంచు బహూకరింపఁగా
నొద్దిక నాకొసంగుమని యొక్కరుఁ గోరగ లేరు లేరొకో

అని యూరకుండఁగా పెద్దనకవి లేచి—

పెద్దనబోలు పండితులు పృథ్విని లేరని నీవెఱుంగవే
పెద్దన కీదలంచినను బేరిమి నాకిడు కృష్ణరాణ్ణృపా

అని యాక్రిందిమాలిక నాశువుగా జెప్పెను—

ఉ. "పూతమెఱుంగులుం బసరుపూప బెడంగును జూపునట్టివా
కైతలు? జగ్గునిగ్గునెనగావలె గమ్మన గమ్మనన్వలెన్
రాతిరియున్ పవల్ మరపురానిహొయల్ చెలియారదంపుని
ద్దాతిరితీపులో యనఁగ దారసిలన్వలె లోఁదలంచినన్
బాతిగ బైకొనన్ వలెను బైదలికుతుకలోని పల్లటీ
కూతలనన్వలెన్ సొగసుకుల్కులు రావలె నాలకించినన్
జేతికొలందిఁగౌఁగిటను జేర్చినకన్నియ చిన్నిపొన్నిమే
లూన్తల చన్నుదోయివలె ముచ్చటగావలెఁ బట్టిజూచినన్
దాతొడనున్న మిన్నుల మిఠారపుముద్దులగుమ్మ కమ్మనౌ
వాతెఱదొండపండువలె నాచవిగావలెఁ బంటనూదినన్
గాతలఁదమ్మి చూలిదొరకైన పసపుంజవరాలి సిబ్బెపు
న్మోతెలి యుబ్బురంపుజిగి నిబ్బరపుబ్బ గబ్బిగుబ్బపొం
బూఁతలపూనెకాయ సరిపోడిమి కిన్నెరమెట్లబంతిసం
గాతపురన్నబంతి బయకాడపుఁ గన్నడగౌళపంతుకా
సాతతతాతనంపనన్ దివుటాడెడు గోటమీటుబల్
మ్రోతలనుంబలెన్ హొరవు మొల్లముగావలె నచ్చతెన్గులీ
రీతిగ సంస్కృతంబుపచరించెడు పట్టున భారతీవధూ
టీ తపనీయగర్భవికటీ భవదానవసర్వసాహితీ
ఖ్యాతికనాటక ప్రకరభారతసమ్మత ప్రభా
పాతసుధాప్రపూర బహుభంగఘుమంఘుమఘుంఘుమార్భటీ

జాతకతాళయుగ్మలయసంగతిచుంచు విపంచికామృదం
గాతతతేహితత్తహితహో ధితదంధనుధానుదింధిమి
వ్రాతనయానుకూలపద నారికుహూంద్వహాహారికింకిణి
సూతినఘల్లులాచరణనూపురఝూళఝుళీమరంద సం
ఘాత వియద్ధునీ చక చకద్వికచోత్పల సారసంగ్రహా
యతకుమార గంధవహహారిసుగంధ విలాసయుక్తమై
చేతముచల్లఁజేయవలె జల్లన జల్లవలెన్ మనోహర
ద్యోతకగోస్తనీ ఫలమధుద్రవగోమృతపాయస ప్రసా
రాతిరసప్ర సారరుచిర ప్రబంధంబుగ సారెసారెకున్.

రాయలంతట నానందభరితాత్ముఁడై కవిగండ పెండేరము నిచ్చి బహూకరించెనట. ఆగండపెండేరము ధరియించి, పెద్దనకవి గర్వమును బ్రకటించుచు నొకనాఁడు సభలో నందఱును విను నట్లు శిష్యుల నుద్దేశించి యిట్లు పద్యములో సగము భాగమును జదివెను—

“చ. వదలక మ్రోయు నాంధ్రకవి వాసుపదంబున హేమనూపురం
బుదితము గాళకంఠనినదోద్ధతి నేమనిపల్కుఁ బల్కరా—”

రామకృష్ణుఁడు మిగతభాగము నిట్లు పూరించెను—

చ. ‘వదలక మ్రోయు నాంధ్రకవివాసుపదంబున హేమనూపురం
బుదితము గాళకంఠనినదోద్ధతి నేమనిపల్కుఁ బల్కరా
గుదియలకాలినుండదగు కోమలకంధరభాగ్యరేఖ నీ
నుదుటను లేదులేదనుచు నూఱుతెఱంగుల నొక్కిపల్కురా!’

పెద్దనకవి సిగ్గునొంది యానాటినుండి యట్లనుట మానివైచెను.

---

18 రామకృష్ణుఁడు-గూనిచాకలి.

కృష్ణరాయలొకప్పుడతిజరుగురుగా శత్రురాజులపై దండెత్తుటనుగూర్చి మంత్రివర్గముతో సహాస్యాలోచనం బొనరించు

చున్నతరి రామకృష్ణుండేగి రాయలతో నేదియో పరిహాసమాడెను. రాయలుకోపపరీతచిత్తుండై భటులబిలిచి 'సమయాసమయములెరుగక పరియాచకములాడు రామకృష్ణకవిని కంఠములోతు గోయిత్రవ్వించి, యందు కంఠమువఱకుఁ బాతిపెట్టించి, కుంజరములచే, ద్రొక్కింపుడనెను. రాయలిట్లు కఠినముగా నాజ్ఞాపించుటచే భటులు చేయునది లేక, రామకృష్ణకవి నూరివెలుపలకుఁ గొంపోయి, గోయిత్రవ్వి పాతిపెట్టి ఏనుగును దెచ్చుటకై యంతఃపురముకడ కేగిరి.

ఆసమయమున నొక గూనిచాకలి యామార్గమునఁ బోవుట తటస్థించెను. బట్టలను రేవునుండి యింటికిఁ గొంపోవుచు నతఁడు రామకృష్ణునిఁ జూచి 'బాబూ! ఇది యేమి? తమ్మెవరిట్లు కంఠము వఱకుఁ బూడ్చినారు?' అని యడుగ, నాతఁడు 'ఓరీ చాకలీ! నాకుఁ జిరకాలమునుండి గూనియున్నది ఆగూనిపోవుటకిట్లుచేసితినని' అనెను.

'ఆహా! ఎంత యదృష్టమండీ! బాబూ! తమ గూని బోయినదా?'

నన్ను పైకిదీసినచో దెలియునుగాని, గోతిలోనుండి నేనెట్లు చెప్పగలను? నన్ను పైకిదీసినచో దెలియునుగదా!'

బాబూ! మిమ్ము పైకిఁ దీసెదను గాని మీకుఁ బోయినచో నాగూని కూడ పోవుటకు తమరు సాయము చేయవలయును' అని యాచాకలి గోతిలోని మట్టినిఁ దీసి, రామకృష్ణుఁ డీవలికి రాగానే 'బలే! బలే! మీగూనిపోయినది' అని తానాగోతిలో దిగెను. రామకృష్ణుఁడు మఱల మన్నుఁబూడ్చి వెడలిపోయెను. కొంతసేపైనపిదప రాజభటులు ఏనుగును గొనివచ్చిరి. చాకలి జరుగనున్నది గ్రహించి 'బాబూ! నేను రాజుగారి చాకలి' నని గట్టిగా ఏడ్వసాగెను. రామకృష్ణుఁడు చేసిన మోసమును గ్రహించి భటులు చాకలిని విడిచిరి. రాయలు రామకృష్ణుని జూచి 'నిన్ను జంపుమని గదా నేను భటుల

కానతిచ్చితిని. నీవెట్లు బ్రతికివచ్చితివి?' అని ప్రశ్నింపగా, రామకృష్ణుడు జరిగినదంతయు జెప్పెను. ఆతని యుక్తికి రాయ లపరిమితాహ్లాదము నొందెను.

---

19 విష్ణుచిత్తీయ విమర్శన

రాయలు సకల సామంత మంత్రి పురోహిత బంధుమిత్రపరివార సమాకీర్ణంబైన కొలువుకూటమున గూర్చుండి కవుల నుద్దేశించి యిట్లనెను.

'కవీంద్రులారా! మద్విరచితమైన విష్ణుచిత్తీయమును మీరందఱును జదివియుంటిరిగదా! ఆగ్రంథమునందలి గుణావగుణముల దెలిపిన వారికి మంచి బహుమానమిత్తు' ననెను. ఏమాటయన్న నేమి కీడుమూడునో యను సందేహించి, యెవ్వరును నేమియు జెప్పక యూరకుండగా, రామకృష్ణుడు లేచి, 'మహారాజా! పెక్కు నసందర్భపువాక్యములతో గూడియున్న యాగ్రంథము విమర్శించుట కేమున్నది? ఇచ్చట నేమియును లేదు—భోజనము జేసి పొమ్ము' అనుటలో నర్థమున్నదా!' యనెను.

'రామకృష్ణకవీ! నాగ్రంథ మసందర్భముగా నున్నదా? నీ మాటలసందర్భముగా నున్నవా! ఎప్పుడును బరియాచకమేనా' యని రాయలడుగ, రామకృష్ణుడు 'మహారాజా! పరియాచకమాడుట కే నెంతవాడను, ఉన్నదున్నట్లుగనే చెప్పితిని. వలయు నేని యొకపద్యమును నిదర్శనపూర్వకముగ జదివి చూపింతును.

శా. 'ఆనిష్టానిధిగేహసీమ నడురేయాలించినన్ మోవియున్
తేనాగేంద్ర శయాను పుణ్యకథలుం దివ్యప్రబంధాను సం
ధానధ్యానమునాస్తి శాకబహుతా, నాస్త్యుష్ణతా, నాస్త్యపూ
పో, నాస్త్యోదన సౌష్టవంచ కృపయాభోక్తవ్యమన్నల్కులున్.

తా. కూరలాట్టేలేవు. అందున్న కొంచమైనను వేడిగాలేవు. పిండివంటలు, అన్నముకూడ నంత బాగుగాలేదు. దయచేసి భోజ నము చేయుడు.

దీనిలో నిజముగా సందర్భమున్నదా? యని రామకృష్ణుఁ డడుగగా రాయ లాశ్చర్యాన్వితస్వాంతుఁడై 'రామకృష్ణా! నీ సాహసమును మెచ్చుకొంటి'నని బహుమాన మొసంగెను.

---

20 ఠీవి

రాయల యాస్థానమున ఠీవిగా గూర్చుండువారు సామంత రాజులు. ఆ సామంతుల ఠీవిని జూచినపుడెల్ల రాయలకే నవ్వు వచ్చుచుండును. ఒకనాడు సభలో రాయ లందరనుజూచి, 'ఠీవి విషయమై ప్రసక్తి వచ్చినప్పుడు మా సామంతులను జెప్పి, మరి యొకరి పేరెత్తవలయు' అనఁగా, రామకృష్ణుడు లేచి 'మహారాజా! కోపింపకుడు. నాఠీవిసంగతి మీ రెఱుగరు కావున నట్లు జెప్పు చున్నారు. ఎల్లప్పుడు నేను గురుగుకూర, తిందును. తరిగినకూర యన్న నాకు జాల ప్రీతి ఆగిఁమన్న పడిచత్తును. మేక యెరువు కుంపటి బెట్టుకొని హాయిగా నులకమంచంమీద ఠీవిగా పండుకొం దును' అనెను—

'ఏమిఠీవి అదియా నీఠీవి' యని రాయలపహసింపగా, రామ కృష్ణకవి 'ప్రభువువారు విష్ణుచిత్తీయమున నెట్లు సెలవిచ్చినారో మఱచిపోయినట్లున్నది వినుడు.

'మ. గురుగుంజెంచలి తుమ్మిలేఁదగిరి నాకుందింత్రిణీపల్లవో
త్కరముంగూడ పొరంటి నూనియలతో గట్టావికుట్టారిగో
గిరిముల్మెక్కి తమిం బసుల్పొలములోఁ గ్రేపున్మెయిన్నాకమే
కెరువున్ గుంపటి మంచమెక్కిరి ప్రభుత్వైకాప్తిరెడ్లజ్జడీ'

ఆమాటలు విని రాయ లెంతమాత్రము గినియక చాల ధన మొసగి సత్కరించెను.

21 నల్లకుక్కను ఆవుగ జేయుట

రాయలొకనాటి యుదయమున వపనము జేయించుకొనుటకై మంగలికి గబురుచేసెను. ఆమంగలి వచ్చుటకు గొంచె మాలస్య మయ్యెను. అతఁడువచ్చి చూచుసరికి రాయలు కుర్చీలో గూర్చుండి నిద్రాముద్రితుడై యుండెను. రాయలకు నిద్రాభంగము జేయుట పాడికాదని, మెల్లగా క్షురకర్మ ముగించి వెడలెను. కొంతసేపైన పిదప రాయలులేచి, తాను నిద్రాబద్ధుడై యుండగనే మంగలి క్షౌరముచేసి వెళ్ళిపోవుటచే వాని చాకచక్యమున కెంతయు సంతో షించి, వానికి కబురంపి, 'నీకేమికావలయు?' నని యడిగెను.

'మహారాజా! నాకు చిరకాలమునుండి బ్రాహ్మణుడ కావలె నని యున్నది. నాకు ధనముగాని, మఱేయుఁగాని యక్కఱలేదు. నాకోరిక నెరవేర్చిన జాలును' అని యా క్షురకుడు పలుక, రాయలు 'అదెంతపనియని?' బ్రాహ్మణుల రావించి, శుభదినము నిశ్చయింప జేసెను.

శుభదినమున ద్విజులామంగలిని తుంగభద్రానదికి దీసుకొని వెళ్ళి, స్నానము జేయించి. మంత్రములు జపువుచుండిరి. రామకృష్ణ కవి యీ వృత్తాంతమును దెలిసికొన్నవాడై మఱికొందఱు బ్రాహ్మ ణుల దనవెంట నిడుకొని, నదీతీరమున వారున్నచోటికే పోయి యొకింత దూరముగా నిలువబడి యొక నల్లకుక్కను మాటి మాటికి నీటిలో ముంచుచు, మంత్రపఠన మొనరింపసాగెను. రాయలు సమీ పించి 'రామకృష్ణకవీ! కుక్క నేడ్పించు చున్నావేమి?' అని ప్రశ్నించెను.

రామకృష్ణుడు 'రాజేంద్రా! ఈ శునకమును ఆవుగా జేయ వలయునని యిచటకు గొనివచ్చి, మంత్రముల జదివించుచున్నా' నని బదులుపలుక, రాయలు 'అమాయకుడా! పావనస్రవంతీజలస్నానము వలన, వేదమంత్రపఠనమువలన కుక్కగోవగునా? ఈవిచిత్ర మెచ్చట

నైనకద్దా? యనెను. వికటకవి 'ప్రభూ! తామనుగ్రహించి, మంత్ర మూలమున మంగలిని బ్రాహ్మణునిగా జేయుటలేదా? అదివిచిత్రము కాదా మంగలి ద్విజుండగుటయే తటస్థించునేని యీ శునకము తప్పక గోవగును సందియము లే'దనెను.

తన యవివేకమును దెలియజేయుటకే రామకృష్ణుం డిట్టి పన్నాగము బన్నెనని గ్రహించి, రాయలు మంగలిని పిలిచి 'ఓయీ! నీవు బ్రాహ్మణ్యము నెట్లును బొందజాలవు నీకు వలయునది మరేది యైన గోరుకొనుము' అని చెప్పి, యంతఃపురమునకు బోయెను.

---

22 పింగళి సూరన్న

రామకృష్ణకవి రాయలు తదితరులు నాస్థానమున నుండగా నొకనాడు 'భార్య సద్గుణవతియైనచో బురుషునకు బ్రసిద్ధి—మంచి పేరువచ్చునుగదా! యనెను. పింగళిసూరన్న 'ఆహా! ఎంతగొప్పగా సెలవిచ్చినావు? భార్యగుణవతియైయుండి భర్త దుర్మార్గుడైనచో, భర్తకు గీర్తియెట్లు కలుగును? ఇరువురును గూడ సద్గుణశాలురై యున్నచో గీర్తికలుగుట వాస్తవము' అనెను—

'అవును నీవు రాఘవపాండవీయములో వ్రాసికొనినట్లు చెప్పు చుందువు. నీకవిత్వమునేబలపరచుకొనుచుందు'వని రామకృష్ణుడనగా, రాయలు 'దానికిని దీనికిని సంబంధ మేమున్న?'దనెను, రామకృష్ణ కవి 'ఆర్యా! ఇదిగో యీతడు వ్రాసిన పద్యము.

సుతుని దౌష్ట్యముచే, బలాత్కారముచే ధృతరాష్ట్రుడుకుమా రుని మార్గమునే యనుసరించినను, సతియగు గాంధారి సౌజన్యము వలననే కీర్తికాముడయ్యెను.

'క. సుబల తనయ గుణమహిమన్
ప్రబలి తనకథాంధధర్మ పాలనలీలన్
సొబగొంది వన్నె దేఁగా
విబుధ స్తుతుఁడవ్విభుండు వెలసెన్ ధరణిన్.

తన్నారీతి నాక్షేపణం బొనర్చినందున క్రోధంబునుజెంది, పింగళి సూరన్న యింటికిజనెను. భార్యభోజనమునకు లెమ్మని ప్రతిమాలినను లేవక పింగళి సూరన్న రామకృష్ణుపైగోపముకొలదినొక పద్యము నిట్లు వ్రాయఁబూనెను—

క. 'తెనాలి రామకృష్ణుఁడు
తిన్నాడుర తట్టెడంత—

ఇకమీఁద నాతనికేమియు స్ఫురింపనందున భోజనము చేసి పిదప వ్రాయదలంచి, స్నానార్థము తుంగభద్రకరిగెను. తనపై గోపగించి వెళ్ళినందున ముక్కోపియగు సూరన్న భోజనము చేసి నాడో లేదోయని రామకృష్ణుడు సూరన్న గృహమున కరిగి చావడిలో నున్న తాటియాకుం దిలకించి, తనపైవ్రాసిన యర్థభాగము జదువుకొని, మిగిలిన రెండుపాదములను బూర్తిచేసి వెడలిపోయి, పెద్దనాదికవుల గొసివచ్చెను. ఆసమయమునకు సూరన్న భోజనము చేయుచుండుటచే పెద్దనతాళపత్రముం దిలకించి యందఱు నాలకించునట్లు చదివెను.

'క. తెనాలి రామకృష్ణుఁడు
తిన్నాడుర తట్టెడంత తియ్యనిబెల్లం
బెన్నఁగ మన పింగళి సూ
రన్నకు నోరంత పేడయై పోయెనురా'

అందఱును నవ్విరి. పెద్దన 'సూరన్న ముక్కోపి' యగుట నిటు వ్రాసినాఁడు అనెను. సూరన్న రామకృష్ణుఁడు వ్రాసినమిగతపాదములకు గినియక నవ్వి యూరకుండెను.

---

23 పురాణ శ్రవణము

రాయ లొకనాడు 'రామకృష్ణకవీ ! నెల్లూరు నెఱజాణల నెప్పుడైన జూచితివా?' అని ప్రశ్నించెను. 'చూడకేమి' ప్రభూ! ఒక సారి జూచితిని గాని నాకు సంతృప్తిగలుగునట్లు ఎవతెకైన దగిన ప్రాయశ్చిత్తముం జేయవలయునని చిరకాలమునుండి కోరికగలదు. తమసెలవైనచో నొకసారి యాసింహపురికరిగి, నాకోరిక దీర్చుకొని వత్తును' అనగా రాయ లంగీకరించెను.

రామకృష్ణుడు నెల్లూరుకుబోయి చిత్రాంగి యను వేశ్య మిక్కిలి పాండిత్యము గలిగినదై, యెటువంటి దిట్టలగు పండితులు వచ్చినను ఓడించుచుండెననివిని, యామెను జూడబోయెను.

రామకృష్ణకవిని నారొవెలంది యర్ఘ్యాసనమిచ్చి, గౌరవించి, 'మీరు పురాణముం జెప్పగలరా ? ఎన్నివిధముల బురాణములు చెప్పగలరు ?' అని యడుగ నాతడు 'చిత్రాంగీ ! నేనష్టాదశపురాణముల నభినయానభినార్థ తరన్యాసాకాశాలంబన ప్రత్యక్షవిధానములతో జెప్పుదును.' అనగా నామె 'అట్లయినచో నేటిరాత్రి భోజనానంతరము రందు కొంతసేపు ఖులాసాగా కాలక్షేపము జేయుదము' అనెను.

రాత్రి భోజనానంతరము రామకృష్ణకవి చిత్రాంగియింటికి వెళ్ళెను, ఆమె 'కవిగారూ ! రామాయణములోని సుందరకాండము బహు రసవంతమైన ఘట్టము కావున నాఘట్టమును బ్రత్యక్షపురాణముగ జెప్పుడు' అనెను. అటులనేయని రామకృష్ణకవి 'హనుమంతుడు మహేంద్రపర్వతము నారోహించె'నని మంచమునెక్కెను. 'అటనుండి మైనాకశైలముపైకి దుమికె'నని మఱొకమంచముపైకి దుమికెను. 'లంకలో బ్రవేశించి లంకిణి నిట్లుకొట్టె'నని చిత్రాంగిని గొట్టెను. 'పిదప లంక కగ్నిముట్టించె'నని యావెలయాలి చీర లన్నిటిపై

నూనిపోసి యంటించి 'వాయుసూనుడు సముద్రములో మంటల నార్చుకొనె'నని నూతికడకుబోయి స్నానము చేసి, తనయిల్లంతయు నట్లు చిందరవందర చేసినందుల కలోయని యేడ్చుచున్న యావేశ్య వంక చూచి 'దీనినే ప్రత్యక్షపురాణమందురు. తెలిసినదా' అని వెడలిపోయెను. చిత్రాంగి రోదనీకుహరము ప్రతిధ్వనించునట్లు విల పించును దిన్నగా న్యాయాధికారికడకు బోయి ఫిర్యాదు చేసెను. రామకృష్ణకవి వెళ్ళి, న్యాయాధికారికి యదార్థమంతయు విన్నవించెను న్యాయాధికారి 'చిత్రాంగీ! నీవట్లుకోరుట నిజమేయగుచో నాతడట్లు జేయుటలో దప్పేమియును లే'దని మందలించి పంపెను.

రామకృష్ణకవి ! విజయనగరమునకు దిరిగివెడలి, రాయలను సందర్శించినంతనే, రాయలు 'కవిచంద్రమా; నెల్లూరు నెరజాణల సౌందర్యమును వర్ణింపుము' అని యడుగ, రామకృష్ణు డిట్లాశువుగా బద్యమును రచించి, చదివెను—

సీ. మొలక చీఁకటి జల జల రాల్పగరాదె
నెరులు మించిన వీరి కురులయందు
కెరలించి యమృతంబు గిలకొట్టగారాదె
ముద్దుచూపెడి వీరిమోములందు
పచ్చబంగారు కుప్పలు సేయగారాదె
గబ్బుమీరిన వీరి గుబ్బలందు
పండువెన్నెల తేటఁ బ్రభవింపగారాదె
నగవు గుల్కెడి వీరి మొగమునందు

గీ. నార! కరవాడిచూపుల యాఘుళంబు
బాపురే! భూరికటికటీ భారమహిమ
జాలు మదగజగమనలక్షణముతీర
నేర్పుమించెదరప్పూరి వారసతులు.

24 భాగవతము

కూచిపూడినుండి రాయలకడ ప్రదర్శించుటకై యొకప్పుడు భాగవతులు వెళ్లిరి. రాయ లొకనాడు వారిప్రదర్శనమునకు నిర్ణయించెను. రామకృష్ణుడు వచ్చునో నేదో యల్లరి నారంభించి కథ సరిగా జరుగనీయడని తలంచి, మహారాజా వారితో 'ఏమైనను సరే రామకృష్ణుని రానీయవలదు' అని చెప్పెను. ఈసంగతి రామకృష్ణకవి తెలిసికొని వ్యస్తచిత్తుడై యెట్లైన భాగవతముం జూచి తీరవలయునని, మారువేషమున నచటికేగెను. కావలియున్న భటులు చర్మవేషధారియైన రామకృష్ణుని కంఠస్వరమునుబట్టి గుర్తించి లోనికి బోనీయరైరి. రామకృష్ణుడెంతబతిమాలినను లాభములేకపోయెను. తుద కాతడొక యుక్తి పన్నెను.

'ఓరీ మిత్రులారా! ఒకమాట చెప్పెదను. శ్రద్ధగా వినుడు. రాయలు నేడందరకు నేదోయొక బహుమానమిచ్చును. ఆబహుమానము నాకక్కరలేదు. మీయిరువురకు బంచియిచ్చెదను. నన్ను లోనికి పోనిండు' అని రామకృష్ణుడా కావలివారల కాశపెట్టెను. భటులంగీకరించి, రామకృష్ణకవిని లోనికిబోనిచ్చిరి. కృష్ణుని యల్లరి చేష్టలను యశోదతో గోపికలు చెప్పుచుండునట్టి ఘట్టము భాగవతులచే బ్రదర్శింప బడుచుండెను. యశోద కృష్ణునిచీవాట్లు పెట్టుచుండెను. రామకృష్ణుడు మెల్లగా నాభాగవతులనుసమీపించి కృష్ణపాత్రధారుని కఱ్ఱతోఁగొట్టగా, నాతడు కుయ్యోయ్యోయని యేడ్వసాగెను. ఎవరాయల్లరియని రాయలు ప్రశ్నింప భటులు 'రామకృష్ణకవి' అనిరి.

'ఎందుల కావేషధారిని కొట్టినా'వని రాయలు కవిని నిరోధించి యడుగగా నాతడు 'మహారాజా! యశోద కృష్ణుని మందలించుటయేగాని కొట్టుట బ్రదర్శింపని యీభాగవతుల భాగవతమెంత

యందముగా నున్నది. అందుచే నిది రక్తికట్టుటకై కృష్ణపాత్రధారిని గొట్టినా నని బదులుపలికెను. రాయలు కుపితుడై పహరా నిచ్చుచున్న భటుల బిలిపించి 'రామకృష్ణుని యిరువదినాలుగు దెబ్బలు కొట్టుడని యాజ్ఞాపించెను రామకృష్ణునిఁ దీసికొని పోవుట కాభటులు ముందుకురాగా మహారాజా! మీరు శిక్షవిధించుట న్యాయమేగాని నేను లోనికి వచ్చినపు డీ యిరువురు భటులతోడను, నాకు రాయల వారు ప్రసాదించు బహుమానము చెరిసగము మీకిచ్చెదనంటిని. అందుచేత నాయిరువది నాల్గు దెబ్బలలో వీరికి పండ్రెండు వారికి పండ్రెడు దెబ్బలు తగులవలయు ననెను. ఆభటులు మొఱ్ఱోయని యేడ్వసాగిరి. రామకృష్ణుని యుక్తికిముదమంది రాయలు మన్నించెను.

---

25 తిమ్మరుసు

ఉత్తరదేశ దండయాత్ర పూర్తి చేసికొని వచ్చుచు, రాయలు సింహాచలక్షేత్రమును సందర్శన మొనరించెను. సింహాద్రిస్వామి సన్నిధిని రాయలనేక దానములగావించెను. పెద్దనాది కవులందరు గూడ రాయల ననుసరించియుండిరి. తిమ్మరుసు మంత్రికూడ పెక్కు దానముల జేసెను. రాయ లగ్రహారదానము చేయనెంచితినని చెప్పగా రామకృష్ణుడు తన బంధువుఁడగు మంత్రిప్రగడ బుచ్చి వేంకయ కాదానమిప్పించవలసినదని రాయలను కోరెను. రాయలందులకు సమ్మతింప, తిమ్మరుసు, రామకృష్ణుడు తక్కుంగల కవుల వలె దనయెడ భయభక్తియుక్తుడై మెలంగడను కోపముతో వలదని వారించెను. రామకృష్ణుడు క్రోధమునంది యీపద్యము జదివెను—

ఉ. లొట్టయి దేటిమాట పెనులోభులతో మొగమాటమేల తా
గుట్టకయున్న వృశ్చికము కుమ్మరపువ్వని యాదు రేకదా
పట్టపురాజుపట్టి సరిపల్లె సరాసరి యీయకున్న నే
దిట్టకమాన నామతము తీవ్రమహోగ్రభయాకరంబుగాఁ.

దిట్టితినా? మహోగ్రహుమతిన్ మకరగ్రహఝర్ఝరీభటా
పట్టపుదట్ట ఫాలఫణిభర్తృబహూకృతపర్జటస్ఫుటా
ఘట్టదట్టనాల కవిఘట్టనిగర్గళ రాజభృత్యకీ
చట్టభధూర్జటీ నయనజర్జరకీలలు రాలగావలెన్
జుట్టరికంబునం బొగడజూచితివా రజితాద్ర్యధిజ్యకీ
పట్టణ మధ్యరంగగతభవ్యవధూవదనానుషంగ సం
హట్ట శిరస్థగాంగఝరహల్లికజాలసుధా తరంగముల్
చుట్టుకొనన్వలెన్ భువనచోద్యముగా భయదంబుగా మటిన్
దిట్టితినా సభాభవన ధీంకృత భీమనృసింహరాడ్య జూ
తాట్ట మహాట్టహాస చతురాననసముద్భ్రుకిటీ తటీవటీ
కోట్టణరోమజాల హృాంతకుంఠిత గంఠగంభీర నాడనం
ఘట్ట విజృంభమాణగతి గావలె, దీవనపద్యమిచ్చి చే
పట్టితినా మణీకనకభాజన భూషణభాసురాంబరా
దట్ట తురంగగంధగజరాజ దమూల ఘనాతపత్రభూ
పట్టణభర్తృభటపంక్తి చిరాయురనామయంబులై
గట్టిగ దోడుతో వెలయగావలె నెక్కువరీవి జూడుడీ
యట్టిటు మంపమేలమును నందఱుకుంబలె జుల్కజూచియే
పట్టుననైన గౌరవము పల్కుకుడీ పయిపెచ్చు నందునన్
గొట్టదు దుష్కవిద్విరదకోటుల వింశముఖోద్భటాకృతిన్
బెట్టుదుదండము ల్సకవిబృందముకే నతిభక్తిసారెకున్
గట్టిది ముల్లెలేబదియు గాగలనూటపదాఱులెయ్యెడన్
రట్టడి రామకృష్ణకవిరాయుని మార్గమెఱుంగ బల్కితిన్'

ఈ పద్యమువిని, తిమ్మరుసుమంత్రి భీతచేతస్కుడయి రాయలచే బుచ్చివెంకునకు గోనేడాగ్రహారమును దానముగ నిప్పించెను. సింహాచలక్షేత్రమున నాలయస్తంభముపై రామకృష్ణుడీశ్లోకమును శిలాశాసనరూపమున వెలయించెను.

శ్లో॥ శాకాబ్దే బహుధాన్యనామనభోనేత్రాబ్ధి చంద్రాన్వితే
కార్తీక్యాం శశివాసరే శుభతిథే సింహాచలస్వామినే
హారంకర్ణ విభూషణేన కటకే శ్రీకృష్ణరాయాధిపా
మాత్యారాచయ సాళ్వతిమ్మ నృపతిః ప్రాదాద్విజన్మాగ్రణిః

నాటినుండియు, తిమ్మరుసుమంత్రి రామకృష్ణునియెడ నాదరాభిమానములు గలిగి మెలంగుచుండెను.

---

26 తిలకాష్ఠ మహిష బంధనము

రాయల యాస్థానమున కొకనాడు రామశాస్త్రి యను పండితుడు వచ్చి 'రాజా! నేను తర్క-వ్యాకరణ పండితుడను. తమ యాస్థానమున విద్వాంసులను గెలుచుట కేతెంచినాను' అనగా రామకృష్ణకవి 'అయ్యా! శాస్త్రిగారూ! తమరు కవిత్వముకూడ చెప్పగలరా?' యని ప్రశ్నించెను.

'వెధవకవిత్వమే చెప్పలేనా? అదికూడ గొప్పయేనా?' అని యా శాస్త్రి పలికెను.

'అయితే మీరు నిస్సంశయముగా వెధవకవిత్వము జెప్పగలరని తలంతును—'

'వెధవకవిత్వము—పునిస్త్రీకవిత్వము నని రెండురకముల కవిత్వము లున్నవా?'

'మీరే యన్నారుగదా, వెధవకవిత్వమే చెప్పలేనా యని అందుచేత మీకెందు పాండిత్యమున్నదో యెఱుంగవచ్చునా?'

'తర్క-వ్యాకరణములందు'—

అయితే ఒకమాట—త్రియంబక, అనుపదమునకున్న యధికారసూత్రమును దెలుపుడు—'

త్రి+అంబకః—ఇది ద్విగుసమాసము.

'ఓహో! ఎంతయందముగా నున్నది. తమరు వ్యాకరణము నింతయందముగా వెలిగించినవారని తలుపలేదు.'

ఆనాటికి గొలువు చాలింపబడెను. మఱునాడు మఱలవాదము ప్రారంభమయ్యెను. రామకృష్ణకవి యొక పెద్దకట్టపై నొకవస్త్రము గప్పియుంచెను.

'ఆ గ్రంథమేదియో యెఱుంగవచ్చునా!' అని రామశాస్త్రి యడుగ, రామకృష్ణుడు 'ఇది తిలకాష్ఠమహిషబంధనమను గ్రంథము. మనవాదమునకు బనికివచ్చునని యీగ్రంథమును గొనివచ్చినా' ననెను.

రామశాస్త్రి 'తిలకాష్ఠ మహిషబంధనమను గ్రంథమున్నదని యెన్నడును వినియుండలేదు.' అందుచే నాతడు కంగారుపడి తనకా నాడు ఓటమి తప్పదని గ్రహించి, 'మహారాజా! బసలో నావ్యాకరణ గ్రంథముల మఱచిపోతిని. త్వరితముగా గొనివత్తును. సెలవిండు' అని వెడలిపోయి, యీ నగరమునుండి వెడలిపోయెను—

రాయలు 'రామకృష్ణకవీ! ఆ రామశాస్త్రి వచ్చులోపున నా తిలకాష్ఠ మహిషబంధనమను గ్రంథమును జదువుము' అనెను.

రామకృష్ణుడు నవ్వుచు 'మహాప్రభూ! తిలకాష్ఠ మహిష బంధనమనగా నేదో గ్రంథమనుకొంటిరిగాబోలును' అనివస్త్రమును దొలగించెను—నువ్వులకంప, కన్నెత్రాడు నుండెను. 'మహారాజా! తిలకాష్ఠ మనగా నువ్వులకంప, మహిషబంధన మనగా యెద్దును గట్టు కన్నెత్రాడు' అనెను.

'నిజముగా నా పేరువిని యీశాస్త్రి కంగారుపడి పాఱిపోయి నాడు' అని పెద్దనకవి పలుకగా నందఱును నవ్విరి.

27 కుమ్మర మొల్ల

రాయలు విద్యానగర సామ్రాజ్యమును బరిపాలించుచున్న కాలమున నాతుకూరి మొల్లయను కుమ్మరస్త్రీ యుండెను. భర్త యామె బాల్యముననే మృతినొందినను, మారుమనుమున కిష్టము లేనిదై నాంధ్రమున బరిశ్రమ మొనరించి, కవిత్వముచెప్పుట నేర్చెను. శ్రీశైలశైవారాధ్యులవారికడ శుశ్రూష చేయుచు జాలకాలము గడపెను. శైవారాధ్యులవారికి సంతానము లేకుండుటచే దమ యవసానదశలో దమకున్న ధనమంతయు నిచ్చివైచిరి. ఆధనముతో నామె యుదరపోషణ మొనరించుకొనుచు, దన కవితాశక్తినంతయు వినియోగించి, రామాయణము వ్రాసెను.

ఆ రామాయణము నామె రాయల కంకిత మీయ నెంచి, యాస్థానమున కరిగి చదువుట కనుమతి నీయగోరెను. రాయలు వల్లెయనగా, రామకృష్ణకవి 'ఆడుదికూడ—నందులో గుమ్మరస్త్రీ కుండలు చేసికొనుటకు మాఱు రామాయణమే రచించుటయా'యని నిరసనభావముతో 'రాజేంద్రా! నేనొక పద్యము వ్రాసితిని. ముందు నాపద్యము నాకర్ణించి, తరువాత నాగ్రంథమును జిత్తగించుడు'అని ముందుగా 'వాల్మీకి దన బూతుపద్యము జదివెను. మొల్ల సిగ్గుపడి, యచటినుండి వెడలిపోయి తన గ్రంథమును శ్రీరామచంద్రునకే యంకిత మొసంగెను. ఆవృత్తాంతము నాలకించి, రాయ లామెను బిలిపించి మొల్లా! నీవు బహుజనశ్లాఘనీయమగు పని జేసితివి. రామచంద్రున కంకితమిచ్చి, 'ధన్యవైతి'వని కొంతధనము నిచ్చి నీవు మా నగరమున నివసింపుము. ప్రతివత్సరమును నీయుదరపోషణకు వలయు ధనము మేమిచ్చుచుందు'మనెను.

ఆమె నిగర్వి. తనకు నౌకరులుండవలసిన బనిలేదని, స్వయముగా నంగడికిబోయి వలయు సంబారముల దానే కొనితెచ్చుకొను

చుండును. ఒకనాడామె యంగడికిబోయి కోడిపెట్ట నొకదానిం గొని కుక్కగొలుసు మెడకొకకేలంబూని వచ్చుచుండెను. రామకృష్ణుడామార్గముననే పోవుచు తనకెదురైన మొల్లనుజూచి, పరిహాసపూర్వకముగా 'మొల్లా! రూపాయిచ్చెద కుక్కనిచ్చెదవా, పెట్ట నిచ్చెదవా? యనెను. ఆ వ్యంగ్య సంభాషణకు కుపితయయ్యు పరమ శాంతస్వభావి యగు మొల్ల 'రామకృష్ణకవీ! నీవేమి యీయంబూనినను నీకు నేనమ్మనుకదా!' యనెను. రామకృష్ణుడు సిగ్గుపడి యారోజునుండియు నామెయందు మాతృభావము కల్గియుండెను.

28 అయిదు వేలు

రాయలు కవులందరకు మానవేతన మిచ్చుచుండెను. రామకృష్ణకవికూడ యదేవిధమున మానవేతనము నొందుచు బిల్లలు కలవాడగుటచే నా ధనముతో గడుపుకొనజాలక యిబ్బంది పడుచుండెను. ఎట్లయిన రాయలునుండి ధనము స్వీకరింపవలయు నని రామకృష్ణు డుపాయముల నూహింపసాగెను. తుదకొక చక్కని యుక్తి నాలోచించి, భార్యాపుత్రులకు జెప్పి, రాయలకడ కరిగెను. రాయలు సంతోషాన్వితస్వాంతుడై యున్నతఱి రామకృష్ణుడు సమీపించి, మహారాజా! నాగుండెలు నిరంతరము నగ్నిహోత్రముచే దహింపబడినట్లుమండిపోవుచున్నవి. ఇక నేనెంతోకాలము బ్రతుకను. నాకు జాలమంది పిల్లలు కలరు. నేను మరణించినచో వారిపాట్లు వర్ణించుట కా యాదిశేషునికైన నలవికాదు, జ్యోతిష్కులుకూడ నిక నెంతోకాలము బ్రతుకవనిరి. నాకు జాల బెంగగానున్నదనెను. రాయలు దయార్ద్రహృదయుడు. రామకృష్ణుని వాక్యములకు జాలి నొంది 'కవిచంద్రమా! ధనార్జనాసక్తులగు జ్యోతిష్కులమాట పాటింపరాదు. నీవట్టి బెంగలతో క్రుంగిపోకుము. 'మనోవ్యాధికి మందులేదుకదా? యను సూక్తి నెఱుంగవే? ఒకవేళ నీవు మృతి నొందుటయే తటస్థించినచో నీభార్యకయిదువేల దీనారముల నంపె

దను, చాలునా?' యనెను. రామకృష్ణుడు మిక్కిలి సంతసించి వెడలి పోయెను.

వారమురోజులు కడచెను. రామకృష్ణుడు తన బంధుగుల జూచుటకయి కలుబరిగె నగరమునకు బోయెను. వెళ్ళిన నాలుగు రోజులకు ఆ బంధువునికడనుండి పెద్దన్న, పింగళిసూరన్న మున్నగు కవుల యింటికి రామకృష్ణుడు జ్వరపీడితుడై మరణించెనని లేఖలు వచ్చెను. నగరమంతయు క్షణములో నావార్త వ్యాపించెను. అట్టి హాస్యగాడు దొరకడని వర్తకులనిరి. 'మంచిస్నేహితుని,కవిని, గోల్పో యితి' నని రాయలు కన్నీరువిడిచి వెంటనే అయిదువేల దీనారము లను రామకృష్ణుని భార్యకంపెను. పదునైదు దినములు గడచెను. రామకృష్ణకవి కలుబరిగె నగరమునుండి తిరిగివచ్చి, యాస్థానమునకు జనెను. రాయలు, తక్కుంగలవారు 'ఇదియేమిచిత్రము? నీవు మృతినొందితివని లేఖవచ్చెగదా!' యనిరి. రామకృష్ణుడు 'అవును. నేను మృతినొందినమాట వాస్తవమే కాని యమధర్మరాజు 'ఇది యేమి! వీనికింకను గొంతకాలము గడువున్నదని 'ఓరీ! మీ రాయల వారు నీభార్యకయిదువేల దీనారములంపినారు. ఆ ధనమును సుఖ ముగా ననుభవించిర 'మ్మనగా దిగిగివచ్చితిని' అనెను.

'ఆహా! అటులనా! ఈఅయిదువేల దీనారముల బొందుట కెత్తిన గొప్పయెత్తు'అని రాయలు మందహాస మొనరించెను.

---

29 మామిడిపండ్లు

రాయలతల్లి నాగాంబ మరణించుటకు బూర్వము రాయలను బిలిచి 'నాయనా! నాకు మామిడిపండ్లు తినవలయునని యున్నది.' అనెను. వెనువెంటనే రాయలు ఎంతఖరీదైనను సరే ఎచ్చటనున్నను సరే ఎన్నిదొరికిన నన్ని మామిడిపండ్లను గొనిరండు' అని భటులను నల్దెసలకంపెను. తిరిగి తిరిగి భటులు ఫలముల గొనివచ్చునంతలో నాగాంబ యసువుల బాసెను. తనతల్లి యవసానదశలో గోరినకోరిక

తీర్చజాలక పోయితిగదా' యని రాయలు పరిమితిలేని విచారము నొందెను.

విషణ్ణవదనులై యున్న రాయలనుగాంచి, తాతాచార్యులవారిట్లనిరి—'ప్రభూ! మీరు గతించినబాపుకై వగచిన ప్రయోజనమేమియును లేదు. బంగారు మామిడిపండ్లను జేయించి, బ్రాహ్మణులకు దానమిచ్చినయెడల నామె కోరిక యుడిగును. మీ మనస్తాపముం దీరును' అనెను. ఆమాటలు నచ్చగా రాయలట్లేయని బంగారు మామిడిపండ్లను జేయించెను. లెక్కలేనంతమంది భూసురులు గుంపులు గుంపులుగా రాసాగిరి. ప్రతిసంవత్సరమును గొన్నివేల దీనారములిందుకు వ్యయమైపోవుచుండుటచే పెద్దనాది కవులు భీతచేతస్కులై రామకృష్ణకవిని హెచ్చరించిరి.

సరేయని రామకృష్ణుడు దేశదేశములనుండి దురాశాపరులై వచ్చిన బ్రాహ్మణులున్న భవనముకడ కరిగి, 'బ్రాహ్మణోత్తములారా! మీకందఱకును మామిడిపండ్లనిచ్చుటకు ముందు రాయలవారొక పద్ధతిని దెలియజేయమనినారు. ఒక్కొక్కపండు కావలసినవారు ఒక్కొక్కవాత పొందవలయును. రెండుపండ్లు కావలసినవారు రెండువాతలను బొందవలయు'నని పలుక, నా బ్రాహ్మణులు విశ్వసించి, ఒక్కొక్కవాతను బొందిరి. కొంతమంది రెండేసి వాతలను పొందిరి. తరువాత రాయలువచ్చి బ్రాహ్మణులందఱకును మామిడి పండ్లీయఁబోయెను. రెండువాతలు పొందిన ద్విజుఁడొకఁడు 'అయ్యా! నేను రెండువాతలు వేయించుకొన్నాను. నాకు రెండు పండ్లీయవలెను' అనెను.

'వాతలేమిటి' అని రాయలు నాశ్చర్యముగాఁ బలుక నా బ్రాహ్మణులందఱును దమవాతలఁ జూపించిరి. రాయలు ముక్కుపై వ్రేలిడుకొని నిర్విణ్ణుఁడయ్యెను. రామకృష్ణునకు వెంటనే కబురంపి, 'నీకు మతిపోయినదా? నేను సంతోషముగా సువర్ణచూతఫలము

లీయఁబోవ నీవందరకును వాతలిడు టేమి?' అనగా రామకృష్ణుఁడు 'మహారాజా! నేను చెప్పునది సావధానచిత్తులరై యాలకింపుడు. మాతల్లి వాతరోగపీడితయై చనిపోవుచు వాతలు, వాతలు అని కలవరించుచు మృతినొందెను. ఆమె ఆత్మసంతృప్తికై యింతమంది బ్రాహ్మణులు మఱల నొకచోట కలియరని యెంచి, యాఫలము నాకు దక్కుటకై వాతల బెట్టించితిని' అని వాక్రుచ్చెను.

తాతాచార్యుల సలహా ననుసరించి, తానొనరింపఁ బూనిన దకృత్యమని బోధింపఁజేయుటకై రామకృష్ణుడు పన్నిన పన్నుగడ యని గ్రహించి రాయ లా దానమును జేయుటమానెను.

---

30 చిన్నాదేవి

రాయలు భార్యలందఱిలో జిన్నాదేవియెడ నత్యంతానురాగయుక్తుడై యుండును. చిన్నాదేవి నందఱివలెగాక ప్రత్యేకానురాగముతో జూచునని యెల్లరకును దెలియును. రామకృష్ణునితో గూడ రాయలు చాలసార్లు 'కవిచంద్రమా! ఇందఱు సతులలో నాకొక్క చిన్నాదేవియెడలనే యంత యనురాగ మేల యుండవలయును? నిజముగా నిది పూర్వజన్మ ఋణానుబంధమైయుండు ననెడివాడు. రామకృష్ణు డొకటిరెండుసార్లట్లు విని 'రాజేంద్రా! నాకొకసందేహము భయము కలుగుచున్నది. 'అతి సర్వత్రవర్జయేత్తను సూత్రానుసారము, అధికానురాగము, అపరిమితప్రేమ తుదకు వైరముగాఁ బరిణమించుట సహజము' అనెను. రాయలు 'వెఱ్ఱివాడా! చిన్నాదేవి యెడ నాకీజీవితములో భేదాభిప్రాయ మెన్నడును కలుగదు అనెను.

కొన్నాళ్ళకు రాయ లొకనాడు చిన్నాదేవితో గలిసి సౌధముపై యంతస్తున గూర్చుండి మలయమారుత సౌఖ్యము ననుభవించుచు నేవోకొన్ని ప్రశ్నలడిగెను. చిన్నాదేవి తన పుట్టినింటివారిం గూర్చి

యేదో యాలోచించుకొనుచుండుటచే నా ప్రశ్నలకు సమాధానము బలుకి దాయెను. 'ఏమాపరధ్యాన' మని రాయలు హెచ్చరింపగా నామె పక్కన పెద్దగానవ్వెను. రాయల కానవ్వు సంతసము కల్గించుటకు మాఱు హాస్యము కలిగించెను. క్రోధోద్దీపితు డయ్యెను రాయలామె నేమియు ననక యటనుండి వెడలిపోయెను. దినములు, వారములు, మాసములు గడచెను. రాయలు చిన్నాదేవి యంతఃపురమున కరుగడాయెను.

చిన్నాదేవి దయార్ద్రహృదయయగుట నందఱికిగౌరవమునకుం బాత్రురాలాయెను. ఆకారణమున రాయ లిట్లు కారణముగ నామెతో మాట్లాడుట మానెనని వినిన వారందఱును వర్ణనాతీతమగు ఖేదము నొందిరి. రామకృష్ణునకు జిన్నాదేవియెడలగల గౌరవమునకు బరిమితి లేదు. అతం డామె యంతఃపురమునకుంబోయి. జరిగినదంతయు దెలిసికొని 'అమ్మా! రాయలు నీయెడ ప్రసన్నుడగుటకు చక్కని యుపాయముం బన్నెదను. కొలది దినములు వేచియుండు'మని ధైర్యము చెప్పి రాయలుకడ కరిగి 'మహాప్రభూ! నాకు జిరకాలమునుండి కాశీ రామేశ్వరయాత్రల జేసి రావలయునని యున్నది. మఱల నొక మాసములో వత్తు'నని పలికి, కొంతధనము దీసికొనెను. ఆతడు వారణాసికిం బోవక రహస్యముగా నింటనేయుండి బంగారముతో వడ్లగింజల జేయించి, యొకనాడు అర్ధరాత్రివేళ నూరివెలుపలనున్న సత్రములోనికేగి, తెల్లవారినపిదప తాను వారణాసినుండి తిరిగివచ్చితినని కబురంపెను. రాయలు మంగళతూర్యారావములు భోరుకలంగ, రామకృష్ణకవి నూరేగించి, తన సౌధములోనికి గొనిపోయి 'రామకృష్ణకవీ! విశేషములేమి?' యని ప్రశ్నింప నాతండు మహారాజా! కాశీలో సదానందసాధువను గొప్పసన్యాసి నాశ్రయించి, బంగారు వడ్లగింజల గొనివచ్చినాను. బంగారపు ధాన్యము పండును'అనెను.

ఆ వడ్లగింజల బాకీపెట్టింపదలంచి 'రేపే శుభదినము. రేపు బాకీపెట్టుదమా?' యనెను. సరేయని రామకృష్ణుడు పలికి, మఱునాటి సాయంకాలము రాయలు, ఆవడ్లు మొలిపించుటకు దున్నించిన స్థలముకడకు వెళ్ళెను. ఆవింత చూచుటకు పెక్కుమంది పౌరులు, కవులు నరిగిరి. రాయలు 'ఇక నవశిష్టమే'వని యడుగ రామకృష్ణుడు 'మహాప్రభూ! ఒక స్వల్పవిషయమును దమతోఁ జెప్పమఱచినాను. పెద్దగా నవ్వనివారే యీవడ్లగింజలను బాకీపెట్టుట కర్హులు' అనెను. 'ఎవరు గట్టిగా నవ్వనివారుందురు? అందఱును యెప్పుడో యొకప్పుడు గట్టిగా నవ్వితీరుదురు' అని రాయలనగా రామకృష్ణుడు 'ప్రభువువారు గట్టిగ నవ్వినజాడ కానరాదుగదా. తాము చల్లవచ్చును' అనెను. అబ్బే! నేను జాలసార్లు గట్టిగ నవ్వియుంటిని' అని రాయలునుడివెను.

'తమ సతియగు చిన్నాదేవిగారు నవ్వరేమో?'

'ఆమెకూడ నవ్వును. అందఱును నవ్వుదురు గట్టిగా నవ్వనట్టి వారీప్రపంచములో నెవ్వరుండరు.

'ఆవిషయ మెఱిఁగి తామెట్లు చిన్నాదేవిగారితో మాట్లాడుట యంతఃపురమునకు బోవుట మానినారు?' అని రామకృష్ణుడు ప్రశ్నించినంతనే రాయలు సిగ్గుపడి కారణము లేకయే ప్రేమానురాగమూర్తియగు నామెను బరిత్యజించి, మహాఘ మొనర్చితినని గ్రహించి 'రామకృష్ణకవీ! నాకు జక్కగా బుద్ధిచెప్పినా'వని పశ్చాత్తాపము నొంది చిన్నాదేవి నెప్పటియట్ల గౌరవింపసాగెను. రామకృష్ణకవి యొనరించిన మహోపకారమునకు గృతజ్ఞతాపూర్వకముగ జాల ధనమిచ్చి సత్కరించెను.

---

31 పట్టెడు మెతుకు

'రాయలకడ సెలవుగొని రామకృష్ణకవి మఱొకసారి నెల్లూరునకు బోయెను. శ్రీమతియను వేశ్య యఖండపాండితీవిభాషితమైతన్ను వాదమునగాని, మఱియేవిషయమునైనగాని గెలిచినవారితో భోగసాగర తరంగముల నోలలాడుటయేగాక వేయి దీనారముల నిచ్చెద' నని ప్రకటన మొనరించి యుండెను. రామకృష్ణుడామె నెట్లయిన నోడించి యాబహుమానము దానొందవలయునని తలంచి, యొకనాటి సాయంసమయమున గడ్డిమోపునెత్తుకొని యావేశ్య యింటికడ కేకవైచెను. ఆమె 'అబ్బీ? గడ్డిమోపెంత?' అని యడిగెను. 'ఆc! తగిలినది. బేరము అః తలంచి, పట్టెడు మెతుకుల కిచ్చెద' ననెను.

'అయితే ఆదొడ్డిలో బడవేయు'మని యా శ్రీమతి పట్టెడన్నము తెచ్చి 'బట్టపట్టు' మనెను—రామకృష్ణుడు 'పాండిత్యమున నను మానినని గర్వించుచున్నావు. పట్టెడు మెతుకున కిచ్చెదనంటిని గాని పట్టెడన్నము కంటినా? చక్కగా ఓడిపోయినావు పందెమొడ్డిన వేయి దీనారములను ఇ'మ్మనెను ఆమె యోడితినని యొప్పుకొని యా రాత్రి యాతనితో సౌఖ్యార్ణవ తరంగమాలికల దేలియాడి వేయి దీనారములనుయిచ్చెను. రామకృష్ణుడు విజయనగరమునకు దిరిగివచ్చి రాయల కీసమాచారము నెరిగించి యాహ్లాద మొదవించెను.

---

32 తాతాచార్యుల కవమానము

వృద్ధుడయ్యును తాతాచార్యులు వేశ్యలగృహమునకు దఱుచుగా వెళ్ళుచుండునని యెవ్వరో చెప్పుటచే రామకృష్ణుc డొకనాcడు 'ఆచార్యులవారూ! తాము గతరాత్రి వేశ్యయగు చంద్రిక గృహ

మున కేగినారా లేదా? నిజము చెప్పుడు లేనిచో రాయలకీ సమాచారము దెలిపితీరుదు' ననఁగా తాతాచార్యులవారు 'రామకృష్ణా! నీవు దేవాంతక నరాంతకుడవు. నీతో నసత్య మెప్పినచో లాభము లేదు. వారవనితా గృహమునకు నేనేగినది సత్యమే కాని నీపుణ్యమాయని యెవరితోడను జెప్పి, నన్నపహాస్యము పాలుచేయకుము' అని ప్రతిమాలిరి.

'అట్లయిన నన్నెత్తుకొని యిటునటు త్రిప్పుడు' అని రామకృష్ణుడు పలుక, చేయునదిలేక తాతాచార్యుల వారాతనిని భుజములపై నెక్కించుకొని యటునిటు తిరుగసాగిరి. అంతఃపుర సౌధముపై నున్న రాయలదిచూచి భటుల బిలిపించి 'ఓరీ! అదుగో! తాతాచార్యులవారి భుజములపై రామకృష్ణు డెక్కినాడు. వెంటనే వానినిటు లీడ్చుకొనిరని డనెను. రాయలు సంజ్ఞచేయుట చూచిన రామకృష్ణుడు వెంటనే క్రిందకురికి 'ఆచార్యులవారూ! మహాపరాధిని క్షమింపుడు. మిమ్ము నేనెత్తుకొందును' అని ఆయన వలదనుచున్నను యెత్తుకొని గంతులు వేయసాగెను. ఇంతలో భటులువచ్చి, రామకృష్ణుని భుజములపై నెక్కియున్న తాతాచార్యులవారినిఁ గ్రిందఁ బడద్రోసి యీడ్చుకొనిపోయిరి. రాయలు ఇదియేమిపనిరా! తాతాచార్యుల వారిని గొనివచ్చిరి?' అని భటులనడుగ, వారు 'మహారాజా! పైనున్న వానినేగదా తాము తీసుకొని రమ్మని సెలవిచ్చినది?' అని యనిరి. రామకృష్ణుని యుపాయమునకు విస్మితుడై రాయలు మన్నించెను.

---

33 పాండురంగ మహాత్మ్యము

తెనాలి రామకృష్ణకవికి మొదట రామలింగమను పేరుగూడ కలదనియు, నితఁడు శివభక్తియుక్తుడై లింగపురాణము నాంధ్రీకరించె

ననియు గొందరు చరిత్రకారులు చెప్పుదురు గాని యీతడు రచించె నని చెప్పబడుచున్న లింగపురాంధ్రీకరణగ్రంథ మిప్పుడెచ్చటను గానరాదు. కాని యీతని విరచితములైన చాటుపద్యములలో గొన్నిటియందు రామలింగమనియే ప్రయోగించుకొని యున్నాడు.

ఉ. లింగనిషిద్ధుఁగల్వలచెంగని మేచకకందరుంద్రిశూ
లింగని, సంగతాళిలవలింగని కర్ధమదూషితస్మృణా
లింగనిఁ గృష్ణచేలుని హలింగని నీలకచన్ విధాతృనా
లింగని, రామలింగకవి లింగనికీర్తి హసించుదిక్కులన్.

పాండురంగ మహాత్మ్యము నీతడు గొన్నాళ్లయినపిదప విష్ణు భక్తుడై విరచించెనని చెప్పుదురు. ఈ యుత్తమ కావ్యమును రామ కృష్ణకవి యొక్క జాగీరుదారయిన పెదసంగమరాజుకడ ప్రధానిగా నుండిన విరూరి వేదాద్రి కంకిత మొసంగెనని ఈ క్రిందిపద్యమువలన బ్రస్ఫుటమగుచున్నది. ఈ విరూరి వేదాద్రిగురువు కందాళయప్పలా చార్యులవారు. ఈయన సారంగుతమ్మకవికిని గురువై యుండెను.

సీ. 'వేదమార్గప్రతిష్ఠాదైవతజ్యేష్ఠుఁ
డభ్యస్త షడ్దర్శనార్థరాశి
యతిరాజరచిత భాష్యగ్రంథనిర్ణేత
యఖిల పురాణేతిహాసకర్త
బంధురదివ్య ప్రబంధానుసంధాత
పంచసంస్కార ప్రపంచచణుఁడు
వాధూల మునిచంద్ర వంశవర్ధనమూర్తి
సకలదేశాచార్య నికరగురువు
గీ. పట్టమేనుంగు శ్రీరంగపతికినణ్ణ
గారిగరాంబురాశి నాహారరస్మి

సారసాహిత్య సర్వస్వశయ్యాపేటి
యావళందారు కందాలయప్పగారు.'

విరూర వేదాద్రినిగురించి—

సీ. తనకులాచారవర్తనవైష్ణవాచార
పర్యాయముల కొజ్జబంతియనఁగఁ
దన సూనృతము పురాతన సత్యనిధులయు
న్నతికిఁ బునఃప్రతిష్ఠితముగాఁగఁ
దనబుద్ధి నీతిశాస్త్రరహస్యములు
తెల్లముగఁ దెల్పునాఖ్యానముద్రగాఁగ,
దనవాయుగంటంబు మొనవాఁడివిశ్వంభ
రాప్రజలకుఁ బ్రాణరక్షగాఁగ

గీ. వెలయుమంగయ గురువగు విభునిపెద్ద
నంగభూపాలమణి వాయునప్రవర్త
అయయుతుండైన రామానుజయ్యసుతుడు
భద్రచారి విరూరి వేదాద్రిశౌరి.

పాండురంగ మాహాత్మ్యము నందలి
ప్రబంధ పద్యరత్నములు

సీ. అవతారమందెనే యఖిలైక జనయిత్రి
కలశరత్నాకర గర్భసీమ
దోఁబుట్టువయ్యెనే తొలుత కాంచనవర్ణ
వెలదివెన్నెలగాయు వేల్పునకును
నాయకయుండునే పరమపావనమూర్తి
చక్రిబాహామధ్య సౌధవీధి
నభిషేకమాడునే యభివర్ణితాచార
దిగ్గజానీత మానసేటనీట
తే. నవనిధానంబు లేదేవి జ[illegible]సరకు
లమ్మహాదేవి శ్రీదేవి యాదిలక్ష్మి
సరసశుభదృష్టి రామానుజయ్యసుతుని
నాదరించు విరూం వేదాద్రినాథు.

సీ. సూత్రవతీదేవి సొబగుపాలిండ్లపై
మలుపచ్చిగంధంపు వలపుతోడ
శిరసులు వంచు నిర్జరకోటిఁ బనిగొను
లెపసియ వేత్రహస్తంబుతోడ
బనియేమియని విన్నపము సేయు సుమనోర
థములయిన దివ్యాయుధములతోడ
బ్రహ్మాండకోటుల పారుపత్తెము లెల్లఁ
తే. శార్ఙ్గిన్ రెండవమూర్తియై జగములేలు
మునిమనోహారి శ్రీసేవ మొదలియారి

చేయుపనులెల్ల సఫలముల్ చేయుఁగాత
మలరిరామానుజయ్య వేదాద్రిపతికి.

సీ. ధరణీధరముఁదాల్చు తన చేవయంతయు
భుజపరిఘంబులఁ బొంకపఱచి
మునుమిన్కగనియైన తన ప్రజ్ఞయంతయు
మతివిశేషమునందు మస్తరించి
ద్వైతారివశమైన తన చిత్తమంతయు
నిరుచు గౌరవమున నివ్వటించి
తనువు వెన్నెలగాయు తనమూర్తి యంతయుఁ
గీర్తివైభవమునఁ గీలుకొలిపి
తే. శేషుఁ డఖిలప్రపంచవిశేషశాలి
నిత్యముక్తుల కాద్యుఁడై నిలుచుపోఁటి
చారుచారిత్రు రామానుజయ్యపుత్రుఁ
గరుణ వేదాద్రి మంత్రిశేఖరుని మనుమ.

సీ. తనకులాచారవర్తన వైష్ణవాచార
పర్యాయముల కొజ్జ బంతిగాఁగఁ
తనసూనృతము పురాతనసత్యనిధుల యు
న్నతికిఁ బునఃప్రతిష్ఠితముగాఁగఁ
దనబుద్ధినీతి శాస్త్రరహస్యములు తెల్ల
ముగ దెల్పువ్యాఖ్యాన ముద్రగాఁగఁ
దనవ్రాయుగంటంబు మొనవాడి విశ్వంభ
రాప్రజలకుఁ బ్రాణరక్షగాఁగఁ
తే. వెలయు మంగయ గురునభూవిభుని పెద్ద
సంఘభూపాలమణి వ్రాయనప్రవృత్తి

జయయుతుండైన రామానుజయ్యసుతుఁడు
భద్రగుణసీరి విరూరివేదాద్రిశౌరి.

సీ. సంహృతాంహస్స్ఫూర్తి సింహాసనుండు నృ
సింహవిక్రముఁడు నృసింహశౌరి
త్రయ్యంతవాసనాగ్రహబుద్ధి నొయ్యారి
యొయ్యారి రామానుజయ్యగారు
గంగాతరంగ సారంగలాంఛనదీప్తిఁ
బొందుకు కీర్తికి రంగరాజు
శరణాగతత్రాణ కరుణాచరణకేళి
వరదరాజులబోలు వంకరాజు
తే. ననఁగ శ్రీరామవిభునికి నంబనున్న
గలిగి రాచంద్రతారార్కగతిఁ బ్రశస్తి
నలువురాత్మజు లౌదార్య సలిలనిధులు
భుజగశాయికి నాలుగు భుజములట్లు.

సీ. సమకూర్పఁగా నేర్చు సకలవైష్ణవశాస్త్ర
సిద్ధాంతశుద్ధాంత సిద్ధిగరిమ
భావణింపఁగా నేర్చు నఖిలావని చక్ర
సామ్రాజ్యపూజ్య విశాలలక్ష్మి
వలసింపఁగా నేర్చు వాలారుఁజూపుల
కోపులు చూపు చకోరదృశల
బాలింపఁగా నేర్చు బాంధవకవిగాయ
కార్థినివహంబు ననుదినంబు
తే. దండనాథునిమాత్రుఁడే దశదిశావ
కాశ సంపూర్ణవిజయ ప్రకాశశాలి

రంగయామాత్యవరదయ్య ప్రకటశౌర్య
ధారివాచాధర ధారిళయ్య

సీ. పట్టెవట్రువయును బరిపుష్టికట్టు
గుడిసున్నకియ్యయు సుడియుముడియు
నైత్వంబు నేత్వంబు నందంబు మందంబు
గిలుకయు బంతులు నిలువు పొలుపు
నయము నిస్సందేహతయు నొప్పుమురువును
ద్రచ్చి వేశినయట్లు తనరుటయును
షడ్వర్గశుద్ధియు జాతియోగ్యతయును
వృద్ధిప్రియంబును విశదగతియు

తే. గీసుకొని వ్రాయసంబులు వ్రాయవ్రాయ
గొంకుకొసరును జేతప్పు గొనకయుండు
లలితముక్తాఫలాకార విలసనమున
మతిమరున్మంత్రి వేదాద్రి మంత్రివరుఁడు.

తే. మాద్రిమీరు విరూరి వేదాద్రిరాజు
దాన ధారార్ద్ర నఖిలప్రధాననదుల
వెచ్చపెట్టుకిట దలయో విబుధతటిని
తరుశశిమౌళిజడలలో డాఁగియుండు.

సీ. కరుణించిచూచెనా కవిగాయకార్ధార్థి
నివహగేహంబుల నెఱయుసిరుల
కోపించిచూచెనా కొండకో నెనవచ్చు
ననవచ్చు నతఁడైన నవనిదూఱు
మెచ్చి మన్నించెనా మొనగ పాలసుడైన
దొరతనంబూనిచ్చి పరిఢవించు

బొందుగావించెనా భువినెట్టి ఖలునకు
నాదట కరుణాప్రసాద మొసంగు

గీ. మంత్రిమాత్రుండై దుర్మంత్రిమథవకథన
చారుచర్యామహత్కార చక్రవర్తి
యద్రివిభుఁడు విరూరివేదాద్రి రామ
భద్రపాదసరోరుహ బంభరంబు

సీ. వృషరేంద్రగమనుఁడీ వేదాద్రినాథుండు
గిరిరాజతనయ యీతిరుమలాంబ
వేదనిశ్వాసుండు వేదాద్రినాథుండు
ధృతి శారదాంబ యీతిరుమలాంబ
విహగేంద్రగమనుఁడీ వేదాద్రినాథుండు
శరధితనూజ యీతిరుమలాంబ
విబుధాధినాథుఁడీ వేదాద్రినాథుండు
ధర శచీదేవి యీతిరుమలాంబ

గీ. యనగననుకూలదాంపత్య వినుతమహిమ
హరువుదీపించెనౌర వేదాద్రివిభుఁడు
హరియశుఁడైన కలకాళహస్తితనయ
తిరుమలాంబయు నిత్యవర్ధిష్ణులక్ష్మి.

సీ. శ్రీకలోదయవధూలోకానన ప్రభా
నాటితబహుచంద్ర నాటకంబు
సమవిర్ధగళిత భాషారత్నమంజరీ
యోజితకథా ప్రపూజనంబు
కైలాసశైల సంకాశ సౌధనివేశ
కౌముదీకనచిత గగనతలము

విస్తీర్ణపణిపణిస్య స్థవస్తువ్రజ
ప్రకటితరత్న గర్భాజఠరము

తే. విపులపవమానతాండవ వేపమాన
లాంఛనధ్వజపటల పల్లవలలామ
మాళికచితకళాకృత్యహేళిహాయము
దీపితంబగు శ్రీకాశికాపురంబు.

సీ. పద్మినీపద్మాత పత్రంబు శిథిలప
త్రాగమై రాయంచ యాత్రయించె
దాలుద్రవత్ఫేన జాలంబుతో ఘోణివి
పంచలరొంపి వలంచి యాడె
దూరోద్గమద్దావధూమ మంబుదబుద్ధి
నెమ్మిలోపొదనుండి నిక్కిచూచె
జఠరస్థజలము నాసానాళమునఁ బీల్చి
సామజంబిరుప్రక్కఁ జిల్లుకొనియె.

తే. సరసిపైనీరు కలకల దెరలి విపిన
సకలవిధులు నిర్యద్గోచ్చయములయ్యె
మిట్టమధ్యాహ్నమిది సుధామధురవాణి
యర్హమిచ్చోఁబథశ్రమ ముపనయింప.

సీ. పీడియం బెడలించి విధురత్నకనకాలు
కాంచితాంబువు పుక్కిలించి యుమిసి
యుదిరి బంగరుప్రాత హారంబట్టు వలెవాటు
సడలించి వెనఁగట్టి స్థలినిజుట్టి
యనయాయి పృథుకహస్తాంతరన్య స్తోప
దోచితార్థము తానె యుద్వహించి

యంగుళీసంజ్ఞ సమయములఁ బ్రత్యేకంబు
మానముల్వాలోనికిఁ జననొనర్చి

తే. ద్వారపార్శ్వస్థ వేదికాలువల జరక
రక్షివర్గంబు టంక్రియారభటి వఱలు
వలయమకూటాదికంబుగ నిలచి మ్రొక్క
నగవుఁ జూచుచు నాతఁడు నగరుఁజొచ్చి

సీ. సనకసనందనాది నిఖిలాంతర్వాణి
హృల్లీనభావంబు సల్ల పెట్టి
విశ్వంభరాభోగ వివిధమూర్త్యంతర
స్ఫురితానుభావంబు బుటలువైచి
శింశుమారాకృతి స్వీకృతి వైకుంఠ
మట్కవిహారంబు జారవిడచి
క్షీరోజమధ్యస్థలీ రత్నసగజూపా
గర్భనివాసంబు కచ్చువడలి

తే. పుండరీకేక్షణుండు శిఖండిబర్హ
మండితశిఖండకుఁడు సతాఖండలుండు
పుండరీకుని మానసాంభోపీఠి
నిండతుమ్మెదవైయుండు నిండుకొలువు.

సీ. తనువుతోఁ జరియించు ధర్మదేవతవోలె
మెలఁపున వసవాటిఁ గలయదిరిగి
గణనమీరిశార్ఙ్గి గుణములు హృదయసం
పుటమించు క్రియవిరుల్ బుట్టఁబెట్టి
తనకుఁ బవిత్రవర్ధనమె కృత్యంబను
కరడ నూతసకశోత్కరము కూర్చి
యపవర్గ ఫలసిద్ధి హాణిసైనఁ జేపట్టు
కైవడి బహుఫలోత్కరము లొడిచి

తే. యోగయాగంబుసలుపుచో నూర్మిపశువి
శంసనమొనరించుటకు యూప సమితిఁ దెచ్చు
భాతిసమిధలుగొని మహాప్రాజ్ఞుఁడొకఁడు
వచ్చుతేఁ బగటికి నిజావాసమునకు.

సీ. యతిమనోగృహదీపి కాంకూరముగులీల
గోవర్ధనాచల గుహఁ మెలఁగుచు
గిరికూబతటరట త్కేకిరాజమురీతి
రాధగద్దసమీంద ప్రాలి నగుచు
జిత్రాభ్రములనేలు సుత్రాము కై వడి
బలువెన్నియాలమండల మెలగుచు
గమల కాగనమధ్య కలహంస విభుభాతి
గూర్మినిచ్చెలిపిండుగొని చెలగుచు
తే. చంద్రబింబమానకు మృదుస్వనము గఱవు
రచస సంజ్వార్ణ శరమూఁదుచు నొనర్చు
నాటలన్నియుఁ జాలించి యరిగెఁ దపసి
పర్ణశాలకు దేవకీరత్నకంబు.

సీ. నీటిలోఁ జివుకక నిలిచి క్రమ్ముఱుపూనిక్కఁ
గఠినకర్పరపుఁజుకొక్కను బిగువు
దంష్ట్ర నెత్తిసమహేతలపు డుపుఁ జీర
యురుదారుకలశయం దుదయమగుట
పరులకు దనకట్ల బలమి చూపువిధంబు
పునిమిన నెత్రు గుగ్గిలపునూనె
ద్వీపాంతరమునకుఁ దెగువమైఁ జనుపెంపు
చేముట్టునాగంటి జీనుతగులు

తే. సాగరాగమమాలిమి శాస్త్రసరణి
వల్లువల్లన చిత్రధావనము గల్గు
నిన్నుఁ దరిచేసి, భవద్వార్ధి నుత్తరించి
దరిఁ దఱియకున్నఁ గలదె మోదము మురారి.

సీ. తుఱుచలై గుమురులై గొనబులై తేఁటాప
గొమ్ముఁజుట్టినజడల్ గుమురుగొనఁగ
మెఱపుల మిట్టలై మిక్కిలి బటువులై
గ్రాలుకన్నులచెన్ను గబ్బుదేర
చక్కనై చెలువమైన చిన్నదియై యొప్పు
మోము దంష్ట్రాటంకముల దలిర్ప
నీలమై నిబిడమై నింగి కిం
దుగనున్న బలుమేని పొగరు మెఱయ
తే. బ్రతిపతికేతనుని పురఃక్షేత్రమాది
యున్న శ్రీక్షేత్రపాలకు యోగిలోక
రమణుముప్పది రెండక్షరముల మంత్ర
రాజను జపించికొల్వ దొరకుశుభములు.

సీ. నిడువాలుగను చూపు నిగిడినచో నెల్ల
బీరెండ రేయెండ బెండ్లియాడి
నిశ్వాసపవనంబు నెనరుచో నెల్ల
బ్రాఘిమ్మ నెత్తావు లాముకవియఁ
బొక్కిటితమ్మిపు ష్పాడియాలుకచో నెల్ల
బ్రహ్మాంకురంబులు ప్రాదుకొనఁగ
నడుగు లెజిగుర్లాకు లంటినచో నెల్ల
వివిధతీర్థశ్రేణి వెల్లివాఱవ

తే. బర్హామణిబంధ మాఁవేల్పుపచ్చనెదుఱ
గ్రచ్చకాయలతిత్తియు గంబుశక్తి
గలిగి విహరించు బౌండరీకంబునందు
నందు లేబట్టి ప్రాలేయ నగముపట్టి.

సీ. నగధ్వని వాహనంబగు గోవృషముఱంకె
లనమెల్పు ఘంటామహాక్వణములు
హారశిరశ్శశిరేఖ యపరావతారంబు
లనబొల్చు సేవాగతాబ్జముఖులు
కాద్రవేయాకల్ప కంఠమూలచ్ఛాయ
లనబొల్చు నగరు ధూపాయతంబు
లీసానభూషణాహిస్ఫటా మణికాంతు
లనబొల్చు రత్నదీపాంకురములు

తే. ఖండపరశుతనుప్రభా ఖండదుగ
జలధికలసీకరములన బొలుచు వేల్పు
టేలికలుచల్లుపూవుదోయిళ్ళగల్లు
నగము మునిముఖునకు దృగానందమొసగె

సీ. చలిదిచిక్కపుజిల్లు సాలుముల్ కాసుపై
నొయ్యారముగ పింఛ మొయ్య జెరివి
భాస్కరాంశులు దూటి పానుప్రేల్వీనుల
వెలలేని మకరకుండలములునిచి
మోచేతివంపుగా ముడిచిబట్టిన కేల
వరదాభయంబు నాపటము జేసి
పొలలేనియరటుల నిరసించుమృదులోరు
యమళమధ్యమున గోయష్టినిలిపి

తే. నిగమనూపురములు మ్రోయ నిఱుకుళముగ
సిగ్గువాసినకటి ప్రకాశింపనురము
కెంపులేమెడఁ గ్రక్కుఁజెక్కుళనగవు
మొలవ నత్తీర్థమునవిల్చిపొల్చు చక్రి.

సీ. కలదు లేదను వాదములకోర్చి మీనుమీ
సమువంటి యొంటిజంగము మెఱవఁగ
లహుసుంకుమదపంక పాణింధమంబైన
తాళిగోణపుఁబెంగు నేలజీరఁ
గడలేని వీడ్యంపుఁ గప్పుచుందురు కావి
మోవివల్లొత్తుల ముసుఁగుదన్న
సానతాఁకులుగల్గు సూనాస్త్రశంఖంబు
గతి నఖరేఖాంక గళము దనర

తే. సఖులు పరిహాసకులు వెంటజనగ యువతి
భుక్త నిర్ముక్త పరిధాన యుక్తుడగుచు
నగరుగంటాపదంబున నగుచుదిరుగు
నొఱపుగలఠీవి జాతిమాత్రోపజీవి.

సీ. పరమేష్ఠినుండి నీతరముదాక కశుద్ధ
తరమయినవంశంబు దలచవైతి
దటిద్రొక్కియున్న యీతల్లిదండ్రుల జాల
పఱచవై సంతోష. పఱచవైతి
నగ్నిసాక్షిగ బెండ్లియాడిన యిల్లాలి
నిల్లాలితాకార నొల్లవైతి
ధర్మశాస్త్రార్థవిత్తముల విత్తములచే
నలరించి విఖ్యాతి నందవైతి

తే. శీలమఖిలంబునిది పిల్ల శీలమనుచు
జదువులివియెల్లఁ జిల్కల చదువులనుచు
దోడివారలునవ్వ నాతోడ! యేల
బేలవైతివి యీగుణం బేల? నీకు.

సీ. మహిషాలపాఁడి మర్మంబుగాఁ బ్రభవింప
నవనవోజ్జ్వలరధి స్నానవిధియు
శుభ్రాభ్రపటలంబు లభ్రంబుపైఁ బర్వ
లఘుధౌతవిమల చేలములకప్పు
సితకుశేశయ కాళి సితకరుద్యుతిహెచ్చ
దొరకినయుచితంపు విరులఘాజ
శాలిపాకస్ఫూర్తిగ్రాల గోరోచనా
సమ్మిశ్రచర్చిక్య సంఘటనము
తే. వ్రజభుజాభోజనములుక్రొం బంటవంట
కములుగావింప గోధూమఖండఖండ
శర్కరాఢ్యసుపక్వ భోజ్యములు నెరపి
విష్ణుఁబూజింపఁదగు పరద్వేశియందు.

సీ సమధికజ్ఞాన విభ్రమముతో గూడంగ
హరిమేన నవతార మైనవారు
మదముపోవగఁ నిండు మనసుతో గూడంగ
బ్రహ్మచర్యము చిక్కఁ బట్టువారు
పరపురుషార్థసంపదలతోడఁ గూడంగ
ధనురాది శస్త్రము ల్దాల్చువారు
ద్వీపాంతరమునఘఁ దెగువమై జనువుంపు
చేముట్టుఁనాగంటి జీనుతగులు
తే. సౌగతాగమమాలిమి శాస్త్రసరణి
వల్గువల్గక చిత్రధావనముగల్గు

నిన్నుఁ దరిచేసి భవవార్ధిని స్తరించి
దరిదటియకున్నఁగలదె మోదము మురారి.

సీ. ...రకుండినజూచి యొక్కింతనగి కృష్ణు
డిదియేమి నీవన్న నిందువదన
కుంచితావయవత్వం గురున్మత్త దత్పాద
బిసరుహంబుల కేలి బిగియబట్టి
కుచ్చిత్తహారములో మునస్వామి! నీపాద
వనరుహంబులు వీనవదలజాల
వీనిలావణ్య మీవేషభూషణముగా
నస్మత్కరాబ్ధి త బంగారు సమగు
తే. గవయిది చలాంఛనం బగుఁగాక యనుడు
నట్లయగుఁగాక సర్వంబు ...! నీవ
నంబరవిము క్తకేశవి ...భూష
ణాంచి తాంగివిన్నై యుండు మనియె శౌరి.

సీ. కాంబరీకచ్ఛపేశ్వరకంకరఘుబీప్త
తాసింధ నల్లిమ తల్లియనగ
జవనసారణపతి స్ఫాటికిస్తంభజం
ధద్యోమన్మణిపాల భంజయనగ
నవనతరాహాదం ప్రాఖవిత్రప్రోత
కలకాఘువకాల ఖండమనగ
గకుబంతకరివర స్కంధసింధుద్వీప
సంసారకాసిత హంసి యనగ
తే. భూరి భూభృచ్ఛి ఖోద్యన్మయూరి యనగ
కృగుథగీరథభరతాది నృపభుజాగ్ర

ఘటితకాలాగరుస్థానకం బనంగ
దగు వసుంధర గృపటల్కు- దైత్యభేది

సీ. ఇంద్రచాపంబు గాదిదిమాళితనమున
సవరించి బర్హిపింఛంబుగాని
భిదుర ఘోషంబుగా దిది పాంచజన్యసం
జాతగంభీర ఘోషంబుగాని
యాశ్రయించిన బలా గావళిగాదిది
హారి ముక్తహార యష్టిగాని
యిదిగోల మెరుగుగా దువిరిబంరంపుగా
గాబసిమిగ్రమ్మెడు పచ్చపట్టునీ
తే. వృష్టిగా దిది కరుణా బు వృష్టిగాని
నీలమేఘుంబుగా దిది నీలవర్ణు(
డౌర నా్రమోల(బ్ర్యేకు మయ్యెననుచు
హర్షపులకితతనువయ్యె న వ్వధూటి

సీ. కలకసిరెంతయు గతకల్మషము జేసె(
గతకాఘలముౌరీతి(గలశసూతి
పాపటదీర్చె భూభాగంబు నాశ్వాస
శాదించు శకటాఘు చక్రధార
శిఖతాండవము కళాసిక(జేసి సడలంచె(
గటుకుటీకలపేరి కాసెబిగువు
లుశిగిన జడవాన లుదయించె వెండియు
గరిఘటమవృషి కైతవమున
తే. తెల్లుశోభిల్లె మంకెనలుల్లసిల్లె
గాలకంధరవాహంబు గజ్జురే(గె

ముదితశతగోపకన్యకా వద నతులిత
లలితరుచిబాల్చె రాకాశశాధరుండు.

సీ. నడతు నీక్షేత్రంబు నకు జేయిదాఁచి
యర్చింతు నీనమ్మిన సేవకులను
మ్రొక్కుదు నీపాదములకు జిహ్వావీధి
నీనామములు వక్కాణింతు నెపుడు
అర్పింతు నీసేవకై సర్వదేహంబున
జింతింతునీలీల జిత్తసరణి
దనివోక నీచక్కదనము సంవీక్షింతు
నీయవధానంబు నెమ్మివిందు

తే. బ్రహ్మరుద్రాదులకుఁ గానఁ బడని నీవు
నేడునా మ్రోల నిలిచితి నీలవర్ణ
వర్ణనాతీతమత్ప్రాభవప్రవృత్తి
పుణ్యపరిపాక మేరికిఁ బొగడదరమె !

శా. ప్రారంభించిన వేదపాఠమునకుం బ్రత్యూహమానంచు నో
యేరాతమ్ముఁడ నన్నుఁ జూడ జనుదే వెన్నాళ్ళనోయుండి చ
కోరాజీవయుగంబువాచె నినుఁ గన్గోనున్కి మీబావయున్
నీరాకన్మదిఁ గోరుజంద్రుపొడుపున్ నిరాకరంబుంబలెన్.

మ. వలనాయేటికి నాశ్రయించి మనఁగా వానీరమున్ నీరమున్
దలవెత్తేపచరింప నేటికి సమద్దానంబు దానంబున
చ్చలమాయేటికి నెత్తిఁగట్టుకొనఁగా సన్న్యాసమున్న్యాసముల్
గలిఁ దేజాలు మదీయభక్తిరుచి భక్తశ్రేణి కశ్రాంతమున్.

సీ. పలువునసొలిపించె నిలువంగడము నెల్ల
శరముల యాయంబు బొరయుటడిపెఁ
దగశబ్దమాత్ర పాత్రముచేసె గుణలత
మ్రానునగట్టించె మూలబలము

కంచుకి వశముగావించె సేనానాథు
గట్టించె సహచరుఁ గటికిమొండ
బ్రతిపక్షభావసంగతుఁడని పెంతుఁజూచె
వరకేతముఁడుకీర్తి భరముదులిపె

గీ. ధర్మనిర్మలబుద్ధి సుశర్మఁగదిసి
గెలువగా లేకచని కోపగించిమదను
దురక పనివాఁగలతనికి నోడుమనిరె
పతికిఁ గీజేటబంట్లు పాపంబుగాదె ?

తే. ఖండపరశుతెను ప్రభాఖండముద్ధ
జలధిజలశీకరములన బొలుచు వేల్పు
శైలికలుచల్లు పూవుదో ఱాళ్ళుగిల్లు
నగము మునిముఖ్యునకు దృగానందమొసగె.

సీ. చలిదిచిక్కుపుజిల్లు సాలుముల్ కొనుపై
నొయ్యారముగ పింఛ మొయ్య
కరివిభాస్కరాంశులు దూరి పాఱుఁబ్రేల్వేనుల
వెలలేనిమకరకుండలములునిచ్చి
మోచేతివంపుగా ముడిచిపట్టిన కేల
వరదాభయంబు లావటముచేసి
పొనలేని యరటుల విరసించుమృదులోరు
యమళమధ్యమున గోయష్టినిలిపి

తే. నిగమనూపురములు మ్రోయ నిరుకుళముగ
సిగ్గువాసినకట్టి ప్రకాశింపనురము
కెంపులేమొండగ్రక్క జెక్కిళ్ళినగవు
మొలవ నుత్తీర్థమునొనిచ్చి పొల్చుఁజక్రి.

సంపూర్ణము.

శ్రీ కొండపల్లి ముద్రాశాల, రాజమంద్రి.

ఆంధ్రనాటకములు

	రు	అ
బళ్ళారి ధర్మవరం గోపాలాచార్యులుగారి		
రామదాసు	1	8
బళ్ళారి కె. బాలసరస్వతిగారి		
భక్తతుకారామ్	1	8
గురజాడ అప్పారావుగారి		
కన్యాశుల్కము	2	0
బళ్ళారి పండిత కె. సుబ్రహ్మణ్యంగారి		
కృష్ణలీల	1	8
లవకుశ	1	8
భక్తకుచేల	1	8
మేవాడు రాజ్యాగ్ని (చారిత్రాత్మక నాటకము)	1	8
విభీషణ పట్టాభిషేకము అను లంకాదహనము	1	8
ద్రౌపదీ వస్త్రాపహరణము	1	8
మిహిర (పద్మిని)	1	8
ముత్తనేని వెంకట చెన్నకేశవులుగారి		
తులసీదేవి (సతీతులసి)	1	8
చిలకమర్తి లక్ష్మీనరసింహముగారి		
గయోపాఖ్యానము	1	12
ప్రసన్నయాదవము	1	8
పారిజాతాపహరణము	1	8
చందాల కేశవదాసుగారి		
కనకతార	1	8
విద్వత్కవి మల్లాది అచ్యుతరామ శాస్త్రిగారి		
సక్కుబాయి(అసలుస్టేజినాటకం)	1	8
శ్రీరాముల సచ్చిదానందశాస్త్రిగారి		
సావిత్రి	1	8

	రు	అ
కీ. శే. కాళ్లకూరి నారాయణరావుగారి		
వరవిక్రయము	1	8
పద్మవ్యూహము	1	8
చిత్రాభ్యుదయం (సారంగధర)	1	8
బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారి		
సత్యహరిశ్చంద్రీయము	1	12
గానాపురం అప్పారావు పట్నాయక్ గారి		
రేవతి	1	8
శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి		
బొబ్బిలియుద్ధము	1	8
విష్ణుభట్ల సుబ్రహ్మణ్యంగారి		
సారంగధర	1	8
కాజ రాధాకృష్ణశాస్త్రిగారి		
జన్మభూమి	1	8
అమరజ్యోతి	1	8
మాధవశర్మ	1	8
ఝాన్సీరాణి	1	8
వేదాంత కవిగారి		
తెనుగుతల్లి	1	8
ఆకలిమంట	1	8
కష్టకాలము	1	8
మహారథి కర్ణ	1	8
విశ్వస్వరాజ్యం	1	8
ఊటుకూరు సత్యనారాయణరావుగారి		
వీరాభిమన్యు	1	8
అనార్కలీ	1	8
ఛత్రపతి శివాజీ	1	8
అహల్య	1	8
ద్రౌపది వస్త్రాపహరణము	1	8

శ్రీ సత్యనారాయణ బుక్ డిపో, రాజమండ్రి.

చరిత్రలు - కథలు

	రు	అ
శ్రీనాథకవి చరిత్ర	0	12
వేములవాడ భీమకవి	0	12
తెనాలి రామకృష్ణ	0	12
బమ్మెర పోతరాజు	0	12
శ్రీకృష్ణదేవరాయలు	0	12
నారదుని కథలు	1	0
సహస్రశిరచ్ఛేద అపూర్వ		
చింతామణి	3	8
నలమహారాజుకథ వచనం	0	12
పంచపాండవుల అజ్ఞాతవాసం		
పెద్దది బైండు	1	8
శ్రీరామవనవాసము	1	0
పరమానందశిష్యుల కథలు	0	6
భోజకాళిదాసు కథలు	0	12
భట్టివిక్రమార్కుని కథలు		
బైండు పెద్దది	3	8
డిటో 200 పేజీలుగలది	1	0
డిటో 100 పేజీలుగలది	0	12
శ్రీమంత్రకథలు 1, 2, 3 భా॥	1	0
రైతుఋణచట్టము	0	2
పాండవవనవాసము	1	0
కాశీక్షేత్రమహాత్మ్యము	0	12
మహాపతివ్రతల కథలు	0	12
మదనకామరాజు కథలు	1	0
హరిశ్చంద్ర వచనం	0	12
మైరావణ చరిత్ర 200 పేజీలు	1	0
ప్రవృద్ధపాండవం	0	8
అభయరాఘవము	0	8

	రు	అ
సౌభ్రాత్రరాఘవము	0	8
విక్రమరాఘవము	0	8
ఆంధ్రుల కథలు	0	12
ఆంధ్రదేశపు కథలు	0	10
కోటమర్తి కథలు	1	8
పెద్దాపుర సంస్థాన చరిత్ర	1	0
పద్మనాభుని యుద్ధము	0	12
ప్రాచీనాంధ్ర నౌకాజీవనము	1	8
ప్రాచీనాంధ్ర విద్యాపీఠము	1	0
శ్రీకృష్ణుడు	0	4
మోడరన్ విద్యాప్రహసనము	0	2
పురూరవచక్రవర్తి కథలు	0	12
మహాభక్తవిజయం అను 30 భక్తుల		
కథలు	1	4
అరేబియన్ నైట్సు కథలు		
కంప్లీటు స్టోరీస్	1	8
శుకసప్తతి కథలు	0	12
కాశీరామేశ్వర మజిలీకథలు	1	0
గులేబకావళి కథలు	1	0
షట్చక్రవర్తుల ఇంద్రజాలపు		
కథలు	0	12
భేతాళపంచవింశతి కథలు	0	12
అల్లూరి సీతారామరాజు చరిత్ర	0	6
పన్నెండురాజుల కథలు	1	0
పదహారురాజుల కథలు	1	0
పోతులూరి వీరబ్రహ్మంగారి		
జీవితం	1	8
రెడ్డిరాజులు	0	8

శ్రీ సత్యనారాయణ బుక్ డిపో, రాజమండ్రి.